RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 7 శనివారం 1 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## బెంగళూరు ప్యాలెస్‌పై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఓకే..

బెంగళూరు: బెంగళూరు ప్యాలెస్ మైదానం భూమి వినియోగానికి సంబంధించి ఆర్డినెన్స్ ద్వారా అవసరమైన స్థలాన్ని వాడుకోవడంతోపాటు నిర్దిష్ట రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అంగీకారం తెలిపారు. 427 ఎకరాలు 16 గుంటల విస్తీర్ణంలోని బెంగళూరు ప్యాలెస్ స్థల వినియోగం, నియంత్రణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లభించింది. గత రాష్ట్రమంత్రివర్గ భేటీలో టీడీఆర్ ఇవ్వరాదని ప్రభుత్వం తీర్మానించింది. ఇందుకు సంబంధించి గవర్నర్ ఆమోదం తెలిపారు. సుమారు 3వేల కోట్ల రూపాయల విలువైన బెంగళూరు ప్యాలెస్ భూమికి సంబంధించి టీడీఆర్ విషయంలో మైసూరు రాజమాత, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం సాగుతోంది.




# అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్!

## మోదీ మూడో టెర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి

### పార్లమెంటు ఉభసభలనుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఢిల్లీ: ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యమని అన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. జనవరి 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశిస్తూ పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులు అర్పించాయి. ప్రధానిగా ఆయన చేసిన సేవలను పార్లమెంట్ సాక్షిగా కొనియాడారు. మరోవైపు మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలో మృతులకు సైతం ఉభయ సభల సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. "బడ్జెట్–2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మా ప్రభుత్వం మూడో టెర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి దూసుకెళ్తోంది. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. అందుకే వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నాం. 3 కోట్ల మంది పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తున్నాం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్ల మందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భారతీయులు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు దగ్గర్లోనే ఉంది. భారత మహిళలు ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తున్నారు. విద్యా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా మారుస్తాం. ఇండియా ఏఐ మిషన్‌ను ప్రారంభించాం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించాం. స్పోర్ట్స్ నుంచి స్పేస్ వరకూ భారత్ దూసుకుపోతోంది. ఎంఎస్ఎమ్ఈల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ తీసుకొచ్చాం. ఇ–గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందుతోంది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సైబర్ సెక్యూరిటీలో సమర్థత పెంచుతున్నాం. దేశ ఆర్థిక, సామాజిక, జాతీయ భద్రతకు పని చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ క్రైమ్, డీప్ ఫేక్ పెనుముప్పుగా మారాయి. దళితులు, వెనకబడిన వర్గాలకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నాం. ఆదివాసీ ప్రాంతాల్లో 30 వైద్య కళాశాలలు ప్రారంభించాం. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు అందుబాటులోకి తెచ్చాం. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పెరుగుతున్న క్యాన్సర్ కేసుల దృష్ట్యా ఔషధాలపై కస్టమ్స్ సుంకం తగ్గించామని" చెప్పారు.

## కుంభమేళాలో మోదీ పుణ్యస్నానం - ముహూర్తం వెనుక..!!



మహాకుంభ మేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున పెద్ద సంఖ్యల భక్తులు తరలి రావటంతో తొక్కిసలాట జరిగింది. 60 మంది ప్రాణాలు కోల్పో గా.. మరో 60 మంది వరకు గాయపడ్డారు. కాగా, కాశీ – ప్రయాగ్ రాజ్ మధ్య భక్తుల రద్దీ అనూహ్యం గా పెరిగింది. ఇక, ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ మహాకుంభ మేళాకు రానున్నారు. అదే రోజు త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం చేయనున్నారు. ఈ ముహూర్తం వెనుక అసలు చర్చ మొదలైంది. మహాకుంభ మేళాలో భక్తులు పోటెత్తుతున్నారు. ఇప్పటి వరకు 18 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం మౌని అమావాస్య సంద ర్భంగా బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగింది. ఇందులో 30 మంది మరణించిన ట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో, యూపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్య ఘాట్‌ల దగ్గర రద్దీ తగ్గించేందుకు ఐదు కీలక మార్పులు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు రోడ్లను వన్ వేగా మార్చారు. వీవీఐపీ పాస్‌లను రద్దు చేశారు. స్పెషల్ పాస్‌లు ఉన్నప్పటికీ అనుమతించటం లేదు. ఇక, ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ మహా కుంభ మేళాకు రానున్నారు. ప్రయాగ్ రాజ్ త్రివేణీ సంగమం లో పుణ్యస్నానం చేయనున్నారు.

అయితే.. ప్రధాని మహాకుంభ్ కు వస్తున్న ముహూర్తానికి మరో ప్రత్యేకత ఉంది. అదే రోజు ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అక్కడ ఎన్నికల పోలింగ్ జరిగే సమయంలో ప్రధాని త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం చేయనున్నారు. ఈ నిర్ణయం పైన రాజకీయంగానూ చర్చ సాగుతోంది. ఢిల్లీ ఎన్నికలకు బీజేపీ ఈ సారి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మూడు ప్రధాన పార్టీలు పోటీలో ఉన్నా.. ఆప్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. దీంతో, ప్రధాని మోదీ ఢిల్లీలో గెలుపు పైన ధీమా వ్యక్తం చేస్తున్న వేళ..అదే రోజున ప్రయాగ్ రాజ్ పర్యటన ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది. బీజేపీ నేతలు మాత్రం ప్రధాని కుంభమేళా పర్యటన.. ఢిల్లీ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.

## ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన





హైదరాబాద్: ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్‌నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవనానికి ముఖమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఇతర మంత్రులతో కలిసి ఆసుపత్రి నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం రానుంది.

**రెండేళ్లలో నిర్మాణం పూర్తి: మంత్రి దామోదర రాజనర్సింహా...** ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడారు. 30 ఏళ్ల కల కొత్త ఉస్మానియా ఆసుపత్రి అని.. ఇది చారిత్రక దినమని చెప్పారు. " ఉస్మానియా దేశంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రి. దీని నూతన భవనం కోసం 6 నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసి సీఎం శంకుస్థాపన చేశారు. 100 ఏళ్లుగా ఈ ఆసుపత్రి సేవలు అందిస్తోంది. వేలాది మంది రోగులకు ఉస్మానియా అంటే ఓ నమ్మకం. అందుకే ఇతర ప్రాంతాలకు దీన్ని తరలించకుండా ఘోషా మహల్‌లోనే ఉంచి ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నాం. 5 భాగాలుగా నిర్మాణం జరుగుతుంది. 100% ఉచితంగా అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. దీనికోసం రూ.2700 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నాం. రెండేళ్లలో మొత్తం భవనం నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తున్నాం" అని దామోదర రాజనర్సింహ అన్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ 5 వేల మంది ఓపీ రోగులను చూసేలా.., 30 విభాగాలతో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.

# స్థానిక ఎన్నికలపై వేగం పెంచిన ప్రభుత్వం - ఎలక్షన్ కమిషన్!




హైదరాబాద్ : గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌వేగం పెంచింది. విలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని పట్టుదలతో ఉన్న ప్రభుత్వం అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తుంది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను మరో సారి అప్?డేట్?చేసే పనిలో నిమగ్నమైంది రాష్ట్ర ఎన్నికల కమిషన్. గత యేడాది 86 గ్రామ పంచాయతీలను సమీపంలోని కార్పొరేషన్‌లలో విలీనం చేయడం లేదా కొత్త మున్సిపాలిటి చేయడం, సమీప మున్సిపాలిటిలో విలీనం చేశారు. ఆ గ్రామాలను తిసి వేసి ఆయా మండలాలు కొత్త ఓటరు జాబితాను, గ్రామం, వార్డుల వారిగా తాజాగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరు జాబితాను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశాల్లో సూచించారు. సప్లమెంటరీ ఓటరు జాబితాను ఫిబ్రవరి 3లోగా ప్రకటించాలని సూచించారు. వీటిపై అభ్యంతరాలను స్వీకరించాలని, అభ్యంతరాలను పరిశీలించాలని సూచించారు. ఫిబ్రవరి 4న ఎంపీడీవో మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఫిబ్రవరి 6న సప్లమెంటరీ ఓటరు తుది జాబితాను ప్రకటించాలని సూచించారు. వీటితో పాటుగా గతంలో గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రకటించిన సమయంలో వివిధ కారణాలతో 64 గ్రామ పంచాయతీల్లో రూపొందించలేదు. ఈ నేపథ్యంలో వాటిని కూడా ఓటరు జాబితాను తయారు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 3న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించాలని, దీనికి తాజాగా ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరుజాబితాను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. 4న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, 5వ తేదీ కల్లా అభ్యంతరాలను స్వీకరించాని, 6న వాటిని పరిష్కరించాలని, 7న తుది ఓటరు జాబితాను 64 గ్రామాల్లో ప్రకటించాలని సూచించారు.

**3 రోజుల్లో ఎంపీటీసీల విభజన...** ప్రతి మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండే విధంగా ప్రభుత్వం చట్టంలో మార్పులు తీసుకవచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతి మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండే విధంగా విభజన చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఈ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఫిబ్రవరి 3 కల్లా విభజన ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం కల్లా అభ్యంతరాలను స్వీకరించాలని, ఫిబ్రవరి 2 కల్లా అభ్యంతరాలను పరిశీలించిన పరిష్కరించాలని, ఫిబ్రవరి 3న తుది ఎంపీటీసీ పరిధి జాబితాను ప్రకటించాలని ఆదేశించారు.

# సంపాదకీయం

## సీఎం అయ్యే చాన్స్ ఎవరికెంత ?

ఏపీలో సీఎం సీటు అయితే ఖాళీగా లేదు అన్నది తెలిసిందే. ముఖ్యమంత్రిగా నాలుగవ సారి రికార్డు సాధించి మరీ చంద్రబాబు చైర్ లో ఉన్నారు. ఆయన వయసు ఏడున్నర పదులు అన్నది జస్ట్ నంబర్ గానే చూడాలి తప్ప మరేమీ కాదని అంటారు. అంతటి హెల్తీగా ఫిట్ నెస్ తో బాబు ఉంటున్నారు. ఆయన ఈ టెర్మ్ చాలా ఈజీగా పూర్తి చేస్తారు అని అంటున్నారు. ఇక చూస్తే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి ఎనిమిది నెలలు మాత్రమే ఉంది. చేతిలో ఇంకా నాలుగేళ్ళ నాలుగు నెలలు మిగిలి ఉంది. మరి సంఖ్యాబలం చూస్తే మొత్తం ఏపీలోని 175 మంది ఎమ్మెల్యేలలో 164 మంది కూటమికి చెందిన వారే ఉన్నారు. అత్యంత పటిష్ఠంగా కూటమి సర్కార్ ఉంది. మరి ఈ సమయంలో సీఎం ఎవరు బాబు తరువాత వారసుడు ఎవరు ఈ చర్చలు ఎందుకు జరుగుతున్నాయన్నది నిజంగా ఆశ్చర్యం కలిగించే పరిణామమే. ఇది ఎలా మొదలైంది అంటే ఈ నెల 8న విశాఖకు ప్రధాని నరేంద్ర మోడీ రాక సందర్భంగా బాబు పవన్ మోడీతో పాటు ఫ్లెక్సీల మీద లోకేష్ ఫోటోలు కనిపించినప్పటి నుంచి అని అంటున్నారు ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి లోకేష్ అని ఒక కాంపెయిన్ టీడీపీ నుంచి కొన్ని రోజులు సాగింది. దాని మీద అధినాయకత్వం అలెర్ట్ అయి ఆదేశాలు జారీ చేసింది. అయినా సీనియర్ నేతలు దీని మీద మాట్లాడుతూనే ఉన్నారు. ఇంతలో సినీ ప్రముఖుడు తన సొంత యూట్యూబ్ ఛానల్ లో వర్తమాన రాజకీయాలు విశ్లేషించే తమ్మారెడ్డి భరద్వాజ అయితే తనకు ఒక కల వచ్చిందని అందులో పవన్ సీఎం లోకేష్ ఉప ముఖ్యమంత్రిగా అయ్యారని చెబుతూ రాజకీయ సంచలనానికి తెర తీశారు. దీంతో దీని మీద అంతా మాట్లాడుకునే పరిస్థితి ఏర్పడింది. అసలు అలా జరిగే వాతావరణం ఉందా అన్నది కూడా చర్చకు వస్తోంది. నిజానికి పవన్ కళ్యాణ్ కూటమికి ఎమోషనల్ స్ట్రెంగ్త్ గా ఉనారు. కానీ రాజకీయాలు అధికారం అంటే నంబర్ గేం ఆ విధంగా చూస్తే ఈ రోజుకు ఈ రోజు సీఎం గా లోకేష్ ని చేసే చాన్స్ టీడీపీకి కచ్చితంగా ఉంది అని అంటున్నారు. మొత్తం అసెంబ్లీలో ఆ పార్టీ బలం 134 మంది ఎమ్మెల్యేలు అన్నది తెలిసిందే. అయితే నంబర్ ఉంటే సరిపోతుందా అన్నది కూడా చిక్కు ప్రశ్న. పొత్తులో ఉన్న మిగిలిన పార్టీలు కూడా కలసి రావాలి. అలా చూస్తే కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తూ పెద్దన్నగా ఉన్న బీజేపీ అనుమతి కూడా కావాలని అంటున్నారు. బీజేపీ ఈ విషయంలో తొందర పడదు కాబట్టి లోకేష్ కి ఉప ముఖ్యమంత్రి అన్నది కూడా ప్రస్తుతానికి ఆగింది అని అంటున్నారు. ఇక పవన్ ఛాన్సెస్ విషయానికి వస్తే ఆయన సీఎం కావాలీ అంటే ఒకటి వచ్చే ఎన్నికల్లో కూటమితో పొత్తులో ఉంటూనే పెద్ద సంఖ్యలో సీట్లు కోరాలి. అవన్నీ గెలిచి కూటమిలో సంఖ్యాపరంగా బలంగా ఉంటే అపుడు సీఎం పోస్టు షేరింగ్ కోరవచ్చు అని అంటున్నారు. అంటే ఈ టెర్మ్ లో కుదరదు అనే అంటున్నారు. అదే విధంగా నారా లోకేష్ విషయంలో చూసుకున్నా 2029 ఎన్నికల్లో పొత్తులో అన్ని పార్టీలు ఉండి ఇదే తీరున మంచి నంబర్ తో సీట్లు గెలవాలి. అందులోనూ మెజారిటీ సీట్లు టీడీపీకి ఉంటే అప్పటికి లోకేష్ కి సీఎం చాన్స్ ఉంటుందని అంటున్నారు. అంతే తప్ప ప్రస్తుతానికి అయితే చంద్రబాబే సీఎం అని ఆయన సీటు ఈ టెర్మ్ లో కదిపే సీన్ ఉండదని అంటున్నారు. కలలు ఎవరు ఎలాగైనా కనవచ్చు కానీ గ్రౌండ్ రియాలిటీ ఎపుడూ వేరేగా ఉంటుందని అంటున్నారు. మొత్తానికి చూస్తే పవన్ లోకేష్ ఇద్దరికీ సీఎం సీటు విషయంలో ఛాన్సెస్ సమానంగానే ఉన్నాయని అంటున్నారు. మిగిలిన రాజకీయం అంతా 2029 తరువాతనే అని చెబుతున్నారు విశ్లేషకులు.

# పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మెడిసిటీ లక్ష్యం : ప్రొఫెసర్ శివరామకృష్ణ





శామీర్ పేట, (గరుడ వార్త) : గ్రామాల్లో పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో మెడిసిటీ ఆస్పత్రి ముందుకు సాగుతోందని మెడిసిటీ ఆస్పత్రి ప్రెసిడెంట్, ప్రొఫెసర్ శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం మూడు చింతలపల్లిలో మాజీ సర్పంచ్ కామిడీ మధుసూదన్ రెడ్డి తో కలిసి మెడిసిటీ ఆస్పత్రి నూతన క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ గ్రామాలలో పేద ప్రజలు, మెడిసిటీ ఆస్పత్రికి రాలేని వారు ఈ క్లినిక్ లో చూపించు కోవాలని కోరారు. ఈ క్లనిక్ లో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూడనున్నట్లు తెలిపారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. మెరుగైన పరీక్షలకు, ఆపరేషన్ అవసరము ఉన్న వారిని మెడిసిటీ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు, పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కామిడీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్లినిక్ ప్రారంభించడం సంతోషిదాయకమన్నారు. ఇక్కడ ఆసుపత్రి ఏర్పాటు చేసిన శివరామకృష్ణ కు వారి యాజమాన్యం కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కామిడి వెంకట నరసింహ రెడ్డి, సదశివ రెడ్డి, సోలాగోని రాజు గౌడ్, అత్వెల్లి రాజుగౌడ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ప్రిన్సిపాల్ నేగి, డాక్టర్ సుదర్శన్, సిఈఓ ఇనేష్, సిఏఓ సత్యంరెడ్డి, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

# మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడింట వివాహానికి హాజరైన... కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్



శామీర్ పేట, (గరుడ వార్త) : కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడి ఇంత వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రం శామీర్ పేటకు చెందిన విలాసాగర్ అశోక్ రాధా దంపతుల కూతురు మనీషా వివాహం కృష్ణ కాంత్ తో శుక్రవారం అంతాయిపల్లి పరిధిలోని ఎస్ ఎన్ ఆర్ వేద కన్వెన్షన్ లో జరిగింది. ఈ వివాహానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, తూము కుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు తరలివచ్చి నూతన వధూవరుల ను ఆశీర్వదించారు.

# మధ్యాహ్న భోజనం.. నాసిరకం



గంగాధర: సర్కారు బడుల్లో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కొన్నేళ్లుగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. గత కొన్ని రోజులుగా గురుకులాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, ఎలాంటి నిబంధనలు పాటించాలో కథనం.

ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు..రెండు రోజుల కిందట గంగాధర మండలం బూర్గుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా వైద్యం పొంది 17 మంది యథావిధిగా పాఠశాలకు హాజరయ్యారు. కొందరు పిల్లలు ఇళ్ల నుంచి తెచ్చుకున్న బాక్స్‌ల్లోనే భోజనం చేశారు.

ఇటీవల పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంతో వండిన అన్నం ముద్దగా మారి తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పాఠశాలను సందర్శించిన డీఈవో జనార్దన్‌రావు తేల్చారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను కలిసి.. సమస్య వివరించి పాత బియ్యం అందించేలా చొరవ చూపుతామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు.

ఈ నెల 12న తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాలలో అన్నం ముద్దగా ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యామని వాపోయారు. కొత్త బియ్యం కారణంగానే ఇలా జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు సెలవిచ్చారు.

జిల్లాలో వివరాలు...

ప్రభుత్వ పాఠశాలలు : 722

విద్యార్థులు : 55,934

వంటలు వండే సమయంలో మార్గదర్శకాలు..

సరైన నీటిని వాడాలి. బోరుబావి నీరు కాకుండా కుళాయి లేదా శుద్ధజలాన్ని ఉపయోగించి బియ్యం ఉడికించాలి. బోరుబావి నీరు కఠినంగా ఉండి అన్నం నాణ్యతను ప్రభావితం చేస్తుంది. వండే ముందు బియ్యాన్ని నీటితో రెండుసార్లు శుద్ధి చేయాలి.

అన్నంలో జిగటును నివారించడానికి, వేడి నీటిలో కొద్ది మొత్తంలో ఎడిబుల్ ఆయిల్‌ను జోడించాలి. ఇది బియ్యం గింజలను వేరుగా ఉంచడానికి సహాయపడుతుంది.

వంట చేసేటప్పుడు అదనపు నీటిని జోడించకుండా ఉండాలి. కావాల్సిన ఆకృతిని సాధించడానికి అవసరమైన నీటిని మాత్రమే వినియోగించాలి. ఎందుకంటే ఎక్కువ నీరు మెత్తని బియ్యానికి దారి తీస్తుంది.

వంట చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెట్ల కొమ్మల ఆకులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కూరగాయలు శుభ్రంగా కడిగి వండాలి. పుచ్చుల్లాంటివి తీసివేయాలి.

నాణ్యమైన సరకులు వాడాలి.

కొత్త బియ్యంతోనే ఈ సమస్య

కొత్త బియ్యం వంటతోనే అన్నం ఉడికీ ఉడకక ఉండలుగా మారి విద్యార్థులు తినడానికి ఇబ్బంది పడుతున్నారని మా దృష్టికి వచ్చింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇవే సరఫరా చేశాం. ఆ బడుల్లో అప్పటికే ఉన్న పాత బియ్యంతో వంట చేయడంతో ఈ సమస్య రాలేదు. ఆహార పదార్థాలు, తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాం. అధికారులకు చెప్పి మార్పిస్తాం. జనార్దన్‌రావు, డీఈవో

# కాసుల బాసులు..

ఆసిఫాబాద్: అత్యంత వెనుకబడిన జిల్లాలో అడుగడుగునా సమస్యలు ఉన్నాయి. కనీస మౌలిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చి, పాలనను పట్టాలెక్కించాల్సిన అధికారులే దారి తప్పి ప్రవర్తించడం జిల్లావాసులకు శాపంలా మారుతోంది. ఈ చోటుకు రావడానికి వెనుకాడే అధికారులు ఒకవైపు, వచ్చిన వారు వీలయినంత సంపాదించాలనే దురుద్దేశంతో పనిచేయడం వల్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే తరహాలో మారుతోంది. గతంలో పనిచేసిన వారు ఇదేతీరున వ్యవహరించడం ఆ తర్వాత బదిలీపై వెళ్లడంతో కొత్తవారైనా తమ కష్టాలు తీర్చుతారనే ప్రజల ఆశలు ప్రతిసారీ అడియాసలవుతున్నాయి. తండ్రి చనిపోతే కారుణ్య నియామకం పరిధిలో రెండేళ్ల కిందట ఉద్యోగంలో చేరిన ఓ వ్యక్తి నేడు అక్రమార్జనకు చిరునామాగా మారాడు. బాసుల అండదండలు, మరో అధికారి సహకారంతో అయినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలో చాలా మంది సీనియర్లు ఉండగా, ఓ అధికారి సదరు వ్యక్తిని తన దగ్గర పెట్టుకుని, వసూళ్ల దందాకు తెరతీశారనే ప్రచారం సాగుతోంది. ఏదైనా ఫైల్ ముందుకు కదలాలంటే, బాస్‌కు ఇస్తున్నారు కదా, నాకు ఇంత ఇవ్వాలనే డిమాండ్ పెడుతున్నాడు. సమస్యలను స్వయంగా గుర్తించి వారితోనే దరఖాస్తులు పెట్టించి పరిష్కరించేందుకు రూ.లక్షలు అడిగిన



తీరుపై అధికారులందరూ విస్మయానికి గురవుతున్నారు. జిల్లాలో చాలా అధికారులు అక్రమార్జనకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

**అక్రమాల తీరిది..**

జిల్లాలో పెట్రోల్‌బంక్ ఓ వ్యక్తికి మంజూరైంది. వివిధ రకాల అనుమతులు పొందే క్రమంలో ఫైల్ బాస్ దగ్గరకు వచ్చింది. బాస్ వెంటనే నమ్మినబంటుకు ఈ పని చక్కబెట్టాలని ఆదేశించాడు. అతను కొంత మొత్తం కావాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఆశ్చర్యపోయాడు. రూ.లక్షల్లో ఇచ్చుకోలేనని, తన వద్ద పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయని మొరపెట్టుకున్నా.. తన అనుచరుడి వద్దకు వెళ్లాలని బాస్ చెప్పడంతో బాధితుడు ఏం చేయలేని పరిస్థితి.

బడా గుత్తేదారుకు చెందిన భూమి ధరణిలో సమస్య ఉంది. దీనిని సరిచేయడానికి భారీ మొత్తంలో డిమాండ్ చేశారు. ఇంత ఇవ్వలేను చూడండని అనడంతో మరో అధికారి వీరి మధ్య డీల్ చేస్తున్నట్లుగా సమాచారం. జిల్లా వ్యాప్తంగా ధరణి సమస్యలు 1300 పైగా ఉన్నాయి. వీరి సమస్యలను పరిష్కరించే క్రమంలో వారికి సంప్రదించి, నచ్చినకాడికి తీసుకుంటున్నారు. మరోవైపు కొందరు వ్యక్తులతో స్వయంగా దరఖాస్తులు సమర్పించి, అనంతరం కాసులు తీసుకుని పనికానిచ్చేస్తున్నారు. ధరణి వెబ్‌సైట్ను ప్రభుత్వం త్వరలోనే రద్దు చేయనున్న నేపథ్యంలో అప్పటి వరకు వీలయినంత జేబులు నింపుకొందామని సదరు వ్యక్తుల దురాలోచనగా ఆరోపణలు ఉన్నాయి.సొంత వ్యక్తులు చనిపోయి పుట్టెడు దుఃఖంతో ఉండి, కారుణ్య నియామకాల కోసం తిరుగుతున్న బాధితుల నుంచి సైతం వసూళ్ల పర్వం కొనసాగుతుందని తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు బిర్యాని, భోజనాలు పెట్టే వ్యక్తికి వచ్చిన బిల్లులో సైతం కమీషన్ కావాలని అడగడంతో సదరు హోటల్ యజమాని బిత్తరపోవాల్సి వచ్చింది. ఏ బిల్లులోనైనా 2 శాతం కమీషన్ కావాలని బాస్ అంటున్నాడని చిన్నబాస్ చెప్పడం, తనకు కొంత ఇవ్వాలని కోరడం, ఈ విషయం బయటకు పొక్కడంపై ప్రజలు అధికారుల తీరును చీదరించు కుంటున్నారు.

# సోయా విక్రయాలకు పడిగాపులు

ఆదిలాబాద్ : సోయా విక్రయాల్లో రైతులకు కొత్తకష్టాలు మొదలయ్యాయి. అన్నదాతల నుంచి కొనుగోలు చేసిన సోయా సంచులకు రైతు పేరున క్యూఆర్ కోడ్ జారీ అవుతుంది. దాన్ని సంచికి జత చేయాల్సి ఉంటుంది. గోదాంలకు పంపించిన తర్వాత కూడా ఏ కేంద్రం నుంచి ఏ రైతు నుంచి కొనుగోలు చేశారనే వివరాలు తెలుసు కునేందుకు వీలుగా సంచులపై క్యూఆర్‌కోడ్ జత చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం జిల్లాల వారీగా సోయా కొనుగోళ్ల లక్ష్యాన్ని విధించింది. జిల్లాలో లక్ష క్వింటాళ్ల సోయా కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అంచనాకు మించి సోయా మార్కెట్‌కు రావడంతో ఇప్పటి వరకు లక్ష్యానికి మించి సోయాను కొనుగోలు చేశారు. ఇతర జిల్లాలో పెద్దగా విక్రయాలు లేకపోవడంతో ఆయా జిల్లాలకు కేటాయించిన లక్ష్యాన్ని జిల్లాకు కేటాయించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా సోయా కొనుగోళ్లకు సంబంధించిన అనుమతులు రాక, క్యూఆర్ కోడ్ జారీ కాలేదు. అప్పటికే సోయాను బస్తాలో నింపి రైతులు ఎదురుచూస్తున్నారు.జైనథ్ మార్కెట్‌లో క్యూఆర్ కోడ్లు రాక పేరుకుపోయిన సోయా నిల్వలు ఇవి. ఇక్కడ భారీగా సోయా రావడం, అవసరం మేరకు క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక సోయాను విక్రయించిన రైతులు మార్కెట్‌లోనే మూడు రోజులుగా చలిలోనే పడిగాపులు కాస్తున్నారు.

ఆదిలాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సోయా ఇది. గతంలో విక్రయించిన సోయా సంచులు రవాణా కాక ఇతర రైతులు సోయాను మార్కెట్‌లోనే నిల్వ చేసుకొని విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు.

జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన దత్తు అనే రైతు ఈ నెల 21న సోయాను తీసుకొని రాగా, తేమ శాతం తదితర వాటిని పరిశీలించి కొనుగోలు చేశారు. తీరా క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి వచ్చే వరకు సోయా పంట బాధ్యత మీదే అని అధికారులు చెప్పడంతో రెండు రోజులుగా మార్కెట్‌లోనే ఉంటున్నాడు.

జైనథ్ మండలం సావాపూర్‌కు చెందిన రమేశ్ ఈ నెల 20న సోయాను విక్రయించేందుకు వచ్చారు. ఒకరోజు తర్వాత కొనుగోలు చేశారు. అప్పటి నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి రాగానే జత చేసిన వెళ్లాలని చెప్పడంతో నాలుగు రోజులుగా అక్కడే ఉన్నారు.

ఆందోళన అవసరం లేదు

ప్రవీణ్‌రెడ్డి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, ఆదిలాబాద్

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి రైతు నుంచి మద్దతు ధరతో సోయాను కొనుగోలు చేస్తాం. రోజు వారీగా కొనుగోలు చేసే మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో సోయా రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్లిప్పులు జారీ కాగానే కేంద్రాలకు పంపిస్తున్నాం.

# లక్షణమైన నంబరు

మెదక్ : వాహనాలకు ఫ్యాన్సీ నంబరు పొందేందుకు యజమానులు పోటీపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ నిర్వహించే ఆన్‌లైన్ వేలంలో రూ.లక్షలో పోసి నచ్చిన నంబర్లు దక్కించుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం గతేడాది మార్చి 15వ తేదీన కొత్త కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి నుంచి రవాణాశాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పది నెలల్లోనే జిల్లాలోని మెదక్ ఆర్టీఏ కార్యాలయానికి 829 ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.46,82,021 ఆదాయం సమకూరింది.



**వేలంలో నంబర్ దక్కించుకొని**

వాహనాలకు ఫ్యాన్సీ, లక్కీ, పుట్టిన రోజులు వచ్చేలా నంబర్లు తీసుకుంటున్నారు. దీనికోసం రూ.లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి 6666 నంబరుకు రూ.1,55,678 వెచ్చించి వేలం పాటలో దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొనే వ్యక్తుల సంఖ్య తెలియదు. దీంతో కేవలం నంబర్లను చూసి ఒకే వ్యక్తి ఎక్కువ బిడ్లు వేసి వాటిని దక్కించుకుంటున్నారు.మెదక్‌లో టీజీ ఫ్యాన్సీ నంబర్లతో 829 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 6666 నంబర్‌ను రూ.1,55 ,678.. 5555 నంబర్‌ను రూ.1,53,500.. 9099 నంబర్‌ను రూ.71,555కు కొనుగోలు చేశారు.

**ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయాలి**

ఆన్‌లైన్‌లో బిడ్లు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తం బిడ్ వేసిన వారికి సంబంధిత నంబరును రిజర్వు చేస్తారు. దాని ప్రకారం వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుంది. ఈ విధానంతో రవాణాశాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది.వెంకటస్వామి, జిల్లా రవాణా శాఖాధికారి

# కంది.. కొనరేంది?

చేర్యాల: పది రోజుల క్రితం కందుల కొనుగోలు కేంద్రాన్ని పోటీ పడి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇప్పటివరకు కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. ఎవరూ పట్టించుకోవటం లేదు. చేర్యాలో కాంగ్రెస్, భారాస ప్రజాప్రతినిధులు, నాయకులు ఒకేరోజు రెండుసార్లు కందుల కొనుగోళ్లు ప్రాంభించారు. కందులను తీసుకొచ్చిన రైతులు వ్యవసాయ మార్కెట్, అటు పీఏసీఎస్ పాలకవర్గాల పనితీరుతో అసహనానికి గురవుతున్నారు. రోజూ వాటిని ఆరబోయడం, రాశి పోయడం చేస్తున్నారు. కొందరు రైతులు వాపసు తీసుకెళ్లి వ్యాపారులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకుండా పోతోంది. ఈ విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి దృష్టికి ఆకునూరు రైతులు ఇటీవల తీసుకెళ్లారు. వెంటనే పీఏసీఎస్ అధికారికి ఆయన ఫోన్ చేసి ఆరా తీశారు. తూకం వేసి కొనుగోలు అనుమతి ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన కందులను సేకరిస్తామని సీఈవో రాములు తెలిపారు. ఆరబోసి, చెత్త లేకుండా నాణ్యత పాటించాలన్నారు.

నమోదు చేయలేదు: ఎల్లయ్య, ధర్మారం, మద్దూరు మండలం
మాది మద్దూరు మండలం ధర్మారం. సొంత భూమిలో 3 ఎకరాల్లో కంది సాగు చేశా. అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదు. నా పేరున రాసివ్వమని మద్దూరులో వ్యవసాయాధికారులను అడిగితే చేర్యాలకు వెళ్లమంటున్నారు. చేర్యాలకు వస్తే మద్దూరు మండల వ్యవసాయాధికారులే ఇవ్వాలంటున్నారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.కాపలా ఉండలేం: తరిగొప్పుల సత్తవ్వ, ముస్త్యాల, చేర్యాల మండలంకందుల సేకరణ చేపట్టగానే మార్కెట్‌కు తేవాలని పది రోజులుగా ఎదురుచూస్తున్నాం. రెండు రోజుల క్రితం పంట తెచ్చాం. వాటికి కాపలా ఉండలేకపోతున్నాం. ఎప్పటికప్పుడు సేకరిస్తే, సమస్య ఉండదు. అందరివీ కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

# ఆగని అక్రమ దందా..!

ఖమ్మం : గ్రానైట్, కంకర క్వారీల నిర్వహణతో రూ.కోట్లు కొల్లగొడుతున్న యజమానులు.. రాయల్టీ చెల్లించకుండా వక్రమార్గాలు అనుసరిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. దొడ్డిదారిన క్వారీలు నిర్వహిస్తూ.. 'నాన్ వర్కింగ్' అని చూపుతూ రాయల్టీ చెల్లించకపోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉల్లంఘనులపై కొరడా ఝులిపించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించుతోంది.

**త్వరలోనే రంగంలోకి..**

రాష్ట్రవ్యాప్తంగా 261 క్వారీలు 'నాన్ వర్కింగ్' జాబితాలో ఉన్నట్లు గనులశాఖ గుర్తించింది. వీటిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని క్వారీలు సుమారు 40 ఉన్నాయని తేల్చింది. కొన్నేళ్లుగా ఆయా క్వారీల్లో ఎలాంటి కార్యకలాపాలు జరపటం లేదని.. వాటి యజమానులు గనులశాఖకు స్పష్టం చేశారు. గనులశాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే 'నాన్ వర్కింగ్' జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఆయా క్వారీల యజమానులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించటం లేదు. గనులశాఖ నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంపై కాంగ్రెస్ సర్కారు సమీక్షలు నిర్వహించింది. గతంలో గ్రానైట్, కంకర క్వారీల యజమానులు మైనింగ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు భూగర్భగనులశాఖ దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్వారీలు, ఉల్లంఘనలకు పాల్పడుతున్న యజమానులపై కొరడా ఝులిపించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి క్వారీల్లో సాగుతున్న అక్రమాలు, ఉల్లంఘనల నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణా, అటవీశాఖల అధికారుల తో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది.

**అనేక చోట్ల ఉల్లంఘనలు**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక క్వారీల్లో ఏళ్లుగా ఉల్లంఘనల తంతు కొనసాగుతోంది. నిషేధిత జాబితాలోని క్వారీల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. కొంతమంది నిర్వాహకులు తమ క్వారీలు పని చేయటం లేదని చూపుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని క్వారీల విషయంలో లెక్కాపత్రమే లేకుండా పోయింది. లీజుల విషయంలోనూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా మైనింగ్‌శాఖ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్వారీల్లో లోపలికి, బయటకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే నిబంధన ఉన్నా విస్మరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని క్వారీలు విద్యుత్తు సౌకర్యం పొందుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొంతమంది అధికారులు ఏళ్లుగా అక్రమాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించటంతో ఉల్లంఘనుల బండారం బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రానైట్, కంకర క్వారీల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పడింది. జిల్లాలోని ఐదు ప్రధాన శాఖల అధికారులు బృందంలో ఉంటారు. ఉన్నతాధికారులు అందించిన జాబితా ప్రకారం బృంద సభ్యులు ఆయా క్వారీల్లో తనిఖీలు చేపట్టనున్నారు. పని చేయని జాబితాలో ఉన్నాయా, పనిచేస్తున్నా నిర్వాహకులు రాయల్టీ ఎగ్గొడుతున్నారా అనే అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. సాయినాథ్, మైనింగ్‌శాఖ ఏడీ, ఖమ్మం

# ఔషధ వ్యర్థాలతో అతలాకుతలం!



నల్గొండ : పరిశ్రమలో రోజంతా వచ్చిన వ్యర్థాలను ట్యాంకర్లలో నిల్వ చేసి అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల మధ్యలో పారబోస్తున్నారు. చౌటుప్పల్ శివారులోని ఫార్మా వ్యర్థాల వల్ల అక్కడి చెరువు కలుషితమై జీవాలు నీళ్లు తాగలేని స్థితికి చేరుకున్నాయి. గతేడాది చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోని అహల్య చెరువు, వెలిమినేడులోని పెద్దచెరువులో గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలు వదలడంతో కాలుష్యంతో రూ.లక్షల విలువ చేసే చేపలు మృతి చెంది మత్స్యకార్మికులకు అపార నష్టం వాటిల్లింది.
ఫిర్యాదు చేసినా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు, పోలీసులు దీనిపై లోతైన విచారణ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫార్మా పరిశ్రమల నుంచి వచ్చే వాసనతో పరిసర ప్రాంతాలతో పాటు, రహదారిపై ప్రయాణిస్తున్న వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డు పక్కనే వ్యర్థాలను పారబోయడంతో హరితహారం కార్యక్రమంలో నాటిన చెట్లు సైతం చనిపోతున్నాయి. వీటిపై ఏం చర్యలు చేపట్టారనే విషయాలపై సదరు పీసీబీ అధికారులకు ఫోన్‌చేస్తే వారు స్పందించలేదు.

**కట్టడిలో అధికారులు విఫలం..**

గతంలో అర్ధరాత్రి వేళ వ్యర్థ రసాయనాలను పారబోయకుండా పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసేది. కానీ సిబ్బంది కొరతతో టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో నామమాత్రంగా అక్కడక్కడా తిరుగుతున్నాయి. పీసీబీ అధికారులు స్పందించి ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న రసాయన పరిశ్రమ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రవాణాకు అనుకూలంగా ఉండటంతోనే...**

చిట్యాల, చౌటుప్పల్ మండలాల్లోని పరిశ్రమలన్నీ జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. హైదరాబాద్ నగర శివార్లలోని రసాయన కంపెనీలను తొలగించేందుకు పదేళ్లక్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకునే రసాయన పరిశ్రమలకు వివిధ రాయితీలు కల్పిస్తామని ప్రకటించింది. దీంతో హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్, వెలిమినేడు, పిట్టంపల్లి, గుండ్రాంపల్లి గ్రామాల శివార్లలో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పరిశ్రమలు ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరిశ్రమలను మూసివేయాలంటూ ఆందోళనలు, ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

# అనాథలుగా కాటికి..!



నల్గొండ : ఆస్తులు ఉంటాయి.. అయినవాళ్లు ఉంటారు.. కారణం ఏమైనా కొందరు చివరి రోజుల్లో ఎవరూ లేని అనాథలుగా మారి జనరల్ ఆసుపత్రిలో దిక్కులేనివారిగా చనిపోతున్నారు. అందరూ ఉన్నా వారి వివరాలు చెప్పలేక, చెప్పడం ఇష్టం లేక అనాథలుగా మారి కాటికి వెళ్తున్నారు.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల మరణ వార్త తెలిసినా కనీసం దహన సంస్కారాలు చేయడానికి కూడా ముందుకు రాని వారు జిల్లాలో పెద్ద సంఖ్యల్లో ఉంటున్నారు. ఏటా పదుల సంఖ్యల్లో మృతి చెందిన వారిని జనరల్ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది సమాచారంతో అవుట్ పోస్టు పోలీసుల ఫిర్యాదుతో పురపాలిక వారు కాల్చేస్తున్నారు.

**ఈ ఏడాది 42 మంది..**

గత ఏడాది జనవరి మొదలుకొని నేటి వరకు జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారు 42 మంది ఉన్నట్లు పోలీస్ అవుట్ పోస్టు లెక్కలు చెబుతున్నాయి. పత్రికలు, పోలీస్ అధికారులు, ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం తెలుసుకొని మృతదేహాలను తీసుకెళ్లిన వారు 28 మంది ఉన్నారు. మరో 14 మృతదేహాలను పురపాలిక సిబ్బంది ఖననం చేశారు.

**వదిలించుకుంటున్నారు..**

వృద్ధ వయసులో దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారిని జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చేవారిలో కొందరు ఎలాంటి వివరాలు నమోదు చేయకుండానే వార్డులో చేర్చి వెళ్లిపోతున్నారు. జనరల్ వార్డులో వృద్ధులను వదిలి వారికి సంబంధించిన ప్లేటు, దుస్తులు, ఇతర వస్తువులతో కూడిన సంచులను మంచానికి సమీపంలో పెట్టిపోతున్నారు. గమనించిన ఆసుపత్రి నర్సులు వారితో మాట్లాడి రోగానికి తగిన మందులు, సూదులు ఇస్తున్నారు.
కానీ వారికి సపర్యలు చేసేవారు లేక మలమూత్ర విసర్జనలు మంచంలోనే చేస్తుండడంతో ఇతర రోగులకు ఇబ్బంది తలెత్తుతుంది. అయినా వార్డుల్లో పనిచేసే నర్సులు సపర్యలు చేయాల్సి వస్తోంది. ప్రతి నెలలో ఇలాంటి వారే ముగ్గురి నుంచి నలుగురు మృతి చెందుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. వృద్ధులను ఆసుపత్రిలో చేర్చేవారిలో మరికొందరు పేర్లు, చరవాణి సంఖ్య రాస్తున్నారు. మృతి చెందిన తరువాత తనిఖీ చేస్తే అందులో నిజాలు ఉండడం లేదు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే..**

జనరల్ ఆసుపత్రిలోని ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులను వదిలివెళ్తున్న జనరల్, మెడికల్ వార్డులతో పాటు ఓపీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పోలీస్‌అవుట్ పోస్టు సిబ్బంది ఇలాంటి వారిపై నిఘా పెంచితే గుర్తు తెలియని మృతదేహాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది.

# పరిశోధన.. రైతులకు బాసట



ములుగు : పంటల సాగులో రైతుల పంథా మారుతోంది. అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకుంటున్నారు. పలువురు మార్కెట్‌లో డిమాండ్ ఉండే వాణిజ్య పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది. శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించి వాటి సత్ఫలితాలను రైతులకు అందించే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఇందుకు వేదికగా మారింది ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ కేంద్రం.
ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ (సీవోఈ) కేంద్రాన్ని 2016లో అప్పటి ప్రభుత్వం నెలకొల్పింది. కేంద్రంలో మామిడి, జామ, నిమ్మ, బత్తాయి, దానిమ్మ వంటి పలు రకాల పండ్ల మొక్కలు నాటి సంరక్షించారు. ఇక్కడి శాస్త్రవేత్తలు అంటుకట్టుడు పద్ధతిలో కొత్త మొక్కలు పెంచారు. ఇలా పెంచిన మొక్కలను నర్సరీలకు సరఫరా చేసి సంరక్షించేలా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత వాటిని రైతులకు అందజేస్తున్నారు.

**30 లక్షల నారు మొక్కలు**

సీవోఈలో ఈ ఏడాది 30 లక్షల కూరగాయల నారు మొక్కలు పెంచుతున్నారు. టమాటా, మిరప, వంగ, క్యాబేజీ, కాలిఫ్లవర్, బ్రకోలి వంటి కూరగాయల నారు మొక్కలను ప్లగ్ ట్రైవ్ నర్సరీలో పెంచుతున్నారు. అధునాతన నర్సరీలో పెంచిన కూరగాయల మొక్కలను సిద్దిపేట, మెదక్, వరంగల్, మహబూబాబాద్, యాదాద్రి–భువనగిరి, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జనగాం జిల్లాల రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఇవి కావాల్సిన రైతులు ఆయా జిల్లాల ఉద్యాన అధికారుల నుంచి ధ్రువీకరణపత్రాలు తీసుకొస్తే ఉచితంగా అందిస్తారు. ప్రస్తుతం టమాట, మిరప, వంగ, క్యాబేజీ రకాలు సిద్ధంగా ఉన్నాయి.

**మరిన్ని ఇలా..**

కేంద్రంలో 50 వేల శ్రీగంధంతో పాటు 45 వేల వెదురు మొక్కలు పెంచుతున్నారు.
ఎల్లప్పుడు డిమాండ్ ఉండే జామ, నిమ్మ తోటల సాగును సైతం చేపట్టారు. నర్సరీలో జామ 10 వేలు, నిమ్మ 6 మొక్కలను పెంచుతున్నారు. జామలో అలహాబాద్ సఫెరా, లక్నో 49 రకం మొక్కలను సంరక్షిస్తున్నారు. బొప్పాయి, అలంకార పూలను పెంచుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం: శ్రీధర్, సీవోఈ ఏడీహెచ్
ప్రభుత్వ ఆదేశాలతో రైతులకు వివిధ మొక్కలు అందించడంపై ప్రణాళికలు రూపొందించాం. వెదురు, అలంకార పూలనూ పెంచుతున్నాం. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి మొక్కలు, కూరగాయలనారు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

20 రకాల మామిడి
రాష్ట్రంలో మామిడి తోటల పెంపకానికి రాయితీలు అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు అనుగుణంగా ములుగు సీవోఈలో 20 రకాలను పెంచుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో డిమాండ్ ఎక్కువ ఉండే వాటిని తీసుకొచ్చి నాటారు. ఏటా 40 వేల మామిడి మొక్కలను నర్సరీలో పెంచి సిద్ధం చేస్తున్నారు. వివిధ రకాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారైనా ఇక్కడికి వచ్చి నేరుగా తీసుకెళ్లే అవకాశం కల్పించారు.

# వయోజనులకు దక్కని ప్రయోజనం

పెద్దశంకరంపేట : చదువురాని వయోజనులకు అక్షరాస్యత అందించడానికి ప్రభుత్వ ప్రోత్సాహం కరవైంది. గతంలో వయోజన విద్య, సాక్షర భారత్ కార్యక్రమాలను అమలు చేసిన ప్రభుత్వం.. పదేళ్లుగా ఈ విద్య గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వయోజనులకు అక్షరాస్యత అందకుండా పోతోంది. 'నవభారత సాక్షరత' పేరుతో వయోజన విద్య అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇందుకు సంబంధించిన విధివిధానాలు, కార్యాచరణ రూపకల్పన లేకపోవడంతో అడుగు పడటం లేదు.

**జీవన నైపుణ్యాలపై..**

మెదక్ జిల్లాలో 2011 గణాంకాల ప్రకారం 56.12 అక్షరాస్యత ఉంది. 2022–27 మధ్య ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. ప్రజలకు అవసరమైన జీవన నైపుణ్యాలను నేర్పించనున్నారు.



15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. చరవాణి వినియోగం, ఆన్‌లైన్ లావాదేవీలు పెరగడంతో డిజిటల్ అక్షరాస్యతతో పాటు ఆర్థిక, వ్యాపార నైపుణ్యాలు, ఆరోగ్య అవగాహన, పిల్లల సంరక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా వృత్తి విద్య శిక్షణ కూడా కల్పించాలని నిర్ణయించారు. ఇందులో కోసం అన్ని రకాల పరికరాలు, వనరులను సమకూర్చనున్నారు. ఈ పథకానికి కేంద్రం 70శాతం, రాష్ట్రం 30శాతం నిధులు కేటాయిస్తుంది.

**వెలువడని విధివిధానాలు ....**

పథకం అమలుకు ప్రతి గ్రామంలో పాఠశాలను యూనిట్‌గా తీసుకొని గ్రామంలో ఎంత మంది నిరక్షరాస్యులు ఉన్నారో ఉపాధ్యాయుల నుంచి సమాచారం తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి మార్గదర్శకాలు వెలువడకపోవడంతో అడుగు ముందుకుపడటం లేదు. నిధుల కేటాయింపు, విధి విధానాలను వెల్లడించకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి.

**మార్గదర్శకాలు వస్తేనే**

నవభారత సాక్షరత కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రాలేదు. నిధుల కేటాయింపు, విధి విధానాలకు సంబంధించిన ఉత్తర్వులు వస్తే కార్యక్రమం అమలుచేయడం జరుగుతుంది.రామేశ్వర్ వయోజన విద్య సమన్వయకర్త

# ఈ పనులు మాకొద్దు!

సంగారెడ్డి : ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం రహదారులు, భవనాలు, తదితర రకాల పనులు పూర్తి చేసేందుకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. ఆయా పనులకు టెండర్లు పిలిచినా గుత్తేదారులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని చోట్ల బిల్లులు రాకపోవడంతో నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ప్రజలకు రవాణా పరంగా కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖలో కీలక పనుల ప్రగతి తీరు తెన్నులపై పరిశీలన కథనం.

**జిల్లాలో ఎక్కడెక్కడంటే..:** నారాయణఖేడ్ నుంచి కల్హేర్ మండలం సుల్తానాబాద్ వరకు 11 కి.మీ. రహదారి బలోపేతానికి రూ.2.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆర్ అండ్‌బీ అధికారులు ఇప్పటివరకు 14 సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు.
కల్హేర్ మండలం బాచేపల్లి నుంచి అలిఖాన్‌పల్లి వరకు. 8 కి.మీ. రోడ్డును బాగు చేసేందుకు రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన లేదు.
కల్హేర్ మీదుగా కామారెడ్డి జిల్లా పిట్లం సరిహద్దు వరకు 2 కి.మీ. ఉంది. ఈ దారి మరమ్మతులకు రూ.76 లక్షలు కేటాయించారు. పనులు చేసేందుకు ఏడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. అత్యధికంగా ఖేడ్ నియోజకవర్గంలో చాలా వరకు అర్ధాంతరంగా నిలిచిపోవడం గమనార్హం.
సదాశివపేట మండలం పెద్దాపూర్ నుంచి కొండాపూర్ మండలం అనంతసాగర్‌కు 10 కి.మీ. దారికి రూ.3.67 కోట్లు కేటాయించినా



ముందుకు సాగడం లేదు.
సదాశివపేట మండలం తంగెడుపల్లి నుంచి మల్లారెడ్డిపేట వరకు 9 కి.మీ. రహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు రూ.15 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు గతేడాది నవంబరు 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే రోజు కొండాపూర్ మండలం మల్లేపల్లి నుంచి కొండాపూర్ వయా తేర్పోల్, హరిదాస్‌పూర్ వరకు రెండు వరుసలుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 7 కి.మీ. మేర రహదారి విస్తరణకు రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ రెండు రోడ్లకు పలుమార్లు ఆర్ అండ్ బీ అధికారులు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ ఆసక్తి చూపలేదు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు: రాంబాబు, ఆర్ అండ్ బీ ఈఈ**

త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రధానరగా రహదారుల పనులు చేసేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. 2021 నుంచి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లుల సమస్య లేదు.

# కోట్లు ఖర్చయినా.. తగ్గని కాలుష్యం

హైదరాబాద్: గ్రేటర్‌లో కాలుష్య నియంత్రణ కోసం గత రెండేళ్లలో చేసిన ఖర్చు అక్షరాల రూ.57.21 కోట్లు.. కానీ, తగ్గింది ఘనపు మీటరు గాలిలో పీఎం10 స్థాయి కేవలం రెండు మైక్రోగ్రాములు మాత్రమే. వాహనాలు, బహిరంగ చెత్త దహనం తదితర కారణాలతో కాలుష్యం పెరుగుతోంది. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరం దిల్లీ బాటలో పయనిస్తుందనడంలో సందేహం లేదు.

**ఆరేళ్లలో 29 మైక్రోగ్రాములు**

జాతీయ వాయుశుద్ధి కార్యక్రమంలో కాలుష్య నియంత్రణకు 'కార్యాచరణ ప్రణాళిక' రూపొందించగా.. సూక్ష్మ ధూళి కణాలు(పీఎం 10, పీఎం 2.5) నిర్దేశించుకున్న స్థాయిలో తగ్గడం లేదు. పీఎం 10స్థాయి ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములకు తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకోగా గత ఆరేళ్లలో 29 మైక్రోగ్రాములు తగ్గి 81 మైక్రోగ్రాములుగా నమోదైందని ప్రాణ (పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ అటైన్‌మెంట్ సిటీస్) నివేదిక స్పష్టం చేసింది.డబ్ల్యూహెచ్‌వో ఏం చెబుతోంది

డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం..ఘనపు మీటరు గాలిలో పీఎం



10స్థాయి 45 మైక్రోగ్రాములకు మించొద్దు. కానీ, 2.11 రెట్లు అధికంగా అంటే సగటున 95 మైక్రోగ్రాములు నమోదవుతోందని 'ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ హైదరాబాద్' పేర్కొంది. హోటళ్లు, దాబాల్లో కట్టెల పొయ్యిని ఉపయోగించడం, 15ఏళ్లకు మించిన వాహనాలను రోడ్డెక్కించడం, చెత్తను కాల్చేయడం, ఇంధన కల్తీ, నిర్మాణ రంగంలో ఆర్ఎంసీలు, రోడ్లపై రేగే దుమ్ము, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు తదితర కారణాలతో కాలుష్యం అధికంగా నమోదవుతోంది. కోకాపేట, సనత్‌నగర్, జూపార్కు, ఉప్పల్, కాప్రా, నాచారంలలో పరిమితికి మించి నమోదవుతోందని నివేదికలు చెబుతున్నాయి.

**పౌరుల భాగస్వామ్యం అవసరం- కోటేశ్వర్‌రావు, నోడల్ అధికారి, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్, జీహెచ్‌ఎంసీ** కాలుష్య నియంత్రణకు పలు కార్యక్రమాలు చేపట్టాం. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం, కాలుష్యంపై అవగాహన, రహదారుల స్వీపింగ్, విద్యుత్ వాహనాలు, పచ్చదనం పెంపుపై నిధులు ఖర్చు చేస్తున్నాం. పౌరుల భాగస్వామ్యం ఉన్నప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ఇండోర్ ఆదర్శంగా నిలవడానికి కారణమిదే. ప్రజా రవాణాను వినియోగించడం, సైకిళ్లకు, తక్కువ దూరం అయితే నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# ఇంటి నల్లా.. వినియోగం మరోలా

హైదరాబాద్: గృహ అవసరాల పేరుతో నీటి కనెక్షన్లు తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటూ జలమండలి రాబడికి గండికొడుతున్నారు. జలమండలి రాబడిపై అక్రమ కనెక్షన్లకు తోడు వాణిజ్య అవసరాలకు ఉచిత నీటిని ఉపయోగించుకు ంటూ నష్టం కలిగిస్తున్నారు. రాబడి పెంచుకునేందుకు జలమండలి గుర్తిస్తున్న వివిధ అంశాల్లో దీని ప్రభావం కూడా ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు.

**ఉచిత నీరు పక్కదారి..**

ప్రస్తుతం నగరంలో గృహ అవసరాలకు నెలకు 20వేల లీటర్లు(20 కేఎల్) వరకు నీటిని ఉచితంగా ఇస్తున్నారు. దీంతో గృహ అవసరాల పేరుతో కనెక్షన్లు భారీగా పెరిగాయి. నగరంలో కాలనీల్లో కమర్షియల్ భవనాల సంఖ్య భారీగా పెరిగింది. జీహెచ్‌ఎంసీలో ఇళ్ల పేరుతో నిర్మాణ అనుమతులు తీసుకుని వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు. ఇలాంటి వాటికి జలమండలిలో డొమెస్టిక్ పేరుతో నీటికనెక్షన్లు



తీసుకుంటున్నారు. వీటిల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, షోరూంలు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ భారీగా నీటిని వినియోగించుకుంటున్నారు.

**సమగ్ర పరిశీలనతో..**

జలమండలి పరిధిలో 13.71 లక్షల నీటి కనెక్షన్లుండగా.. వీటిలో 8.5లక్షల కనెక్షన్లు ఉచిత నీటి పథకంలో ఉన్నాయి. మిగిలిన వాటిలో బహుళ అంతస్తుల భవనాలు, కమర్షియల్ కనెక్షన్లు, పరిశ్రమలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జలమండలి ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సమగ్ర పరిశీలన జరిపి డొమెస్టిక్ కనెక్షన్లు తీసుకొని.. కమర్షియల్‌గా వాడుకుంటున్న వాటిని గుర్తించి.. వాటిని కమర్షియల్ కేటగిరిలోకి మార్చడం ద్వారా రాబడి పెరుగుతుందని భావిస్తున్నారు. కొత్తగా కనెక్షన్లు ఇచ్చేటప్పుడు కూడా ఏ కేటగిరిలో తీసుకున్నారు? అక్కడ ఎలాంటి నిర్మాణం జరుగుతోంది అనే అంశాలను నిర్ధారించుకోవడం ద్వారా ఆరంభంలోనే అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# సబర్బన్ ప్రయాణాల్లో మార్పు వచ్చేనా...?




హైదరాబాద్: రాజధాని పరిధిలో అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద 12 స్టేషన్లలో అభివృద్ధి పనులు, చర్లపల్లి టెర్మినల్ ప్రారంభంతో.. ముంబయి తరహాలో సబర్బన్ రైలు ప్రయాణాల్లోనూ మార్పులు రావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ మేరకు కేంద్రం ప్రకటనలు కురిపించనుందని గంపెడాశలు పెట్టుకున్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల రద్దుకు స్వస్తి పలికి డెడికేటేడ్ ట్రాక్‌ల నిర్మాణం, యాదాద్రికి ఎంఎంటీఎస్ పరుగులు దిశగా అడుగులు పడతాయని ఆశిస్తున్నారు.

**ప్రస్తుతం 80 ఎంఎంటీఎస్‌లే..**

రాజధాని పరిధిలో ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా 120 ఎంఎంటీఎస్‌లు అవసరం. ప్రస్తుతం 80 సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో 1.8లక్షల మంది ప్రయాణికులకు ప్రస్తుతం 50వేల మంది మాత్రమే ఎంఎంటీఎస్‌లలో ప్రయాణిస్తున్నా రు. అతి తక్కువ టిక్కెట్ ఖర్చుతో, అత్యంత వేగంగా గమ్యం చేరుకునే వెసులుబాటు ఉన్న ఎంఎంటీఎస్ మార్గాలను పునరుద్ధరించి, డెడికేటెడ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

**చర్లపల్లికి చేరేదెలా..?**

ఇటీవలే చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైంది. ఇక్కడి నుంచి 25 జతల రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు రచిస్తోంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు సాగుతున్న నేపథ్యంలో ఇక్కడ ఒత్తిడి తగ్గించి తొలిదశలో 10 జతల రైళ్లను చర్లపల్లి నుంచి నడపాలని భావిస్తోంది. చర్లపల్లికి అనుసంధానిస్తూ అవసరమైన ఎంఎంటీఎస్ రైళ్లు లేవు. ప్రస్తుతం ఈ మార్గంలో ఒకే ఒకటి నడుపుతున్నారు. కాచిగూడ, మేడ్చల్, హైదరాబాద్, లింగంపల్లి, తెల్లాపూర్, ఫలక్‌నుమా నుంచి చర్లపల్లికి రైళ్ల రాకపోకలను బట్టి ఎంఎంటీఎస్‌లు నడపాలని సబర్బన్ ట్రావెలర్స్ అసోసియేషన్ కోరుతోంది.

**యాదాద్రి వరకు ఎలా.. ?**

యాదాద్రికి రైల్వేలైన్ పనులను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతేడాది ప్రకటించిన నేపథ్యంలో ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. నగరం నుంచి 65 కిలోమీటర్ల దూరంలో యాదాద్రికి రోడ్డు మార్గంలో 2గంటల సమయం పడుతోంది. అదే ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే రూ.20 టిక్కెట్‌పై గంట వ్యవధిలో చేరుకోవచ్చు. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి, అక్కడి నుంచి యాదాద్రికి లైన్ వేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఘట్‌కేసర్ వరకు పనులు పూర్తికాగా.. మరో 33 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. దీనిపై కేంద్రం ఈ బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# ఆ పాఠశాల వయసు 150ఏళ్లు




హైదరాబాద్: అక్షరం మానవ మేధస్సును పెంచే ఓ అద్భుతం. ఆ అద్భుతం నిజాం హయాంలో షాద్‌నగర్ నియోజకవర్గం మొగిలిగిద్ద గ్రామంలో 150 ఏళ్ల క్రితం చిన్న పాఠశాలగా మొదలై.. ఇప్పటికీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. ఇద్దరు ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డిలతోపాటు ఎందరో మేధావులను, ఉన్నతాధికారులను దేశానికి అందించింది. జనవరి 31న 150 ఏళ్ల వేడుకలకు ముస్తాబవుతోంది. షాద్‌నగర్ పట్టణానికి 9కి.మీ దూరంలో పరిగిరోడ్డు పక్కన గల పెద్దగ్రామం మొగిలిగిద్ద. 1873లో ఈ పాఠశాల ఏర్పా టైంది. తొలుత ఉర్దూ మీడియం, 1957లో తెలుగు, 2008 నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. విజ్ఞాన నిలయంగా.. అప్పట్లో హైదరాబాదు స్టేట్‌గా పిలువబడిన తెలంగాణ ప్రభుత్వ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఈ పాఠశాలలోనే అక్షరాలు నేర్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి ఏడాది పాటు ఇక్కడే చదివారు. మాజీ మంత్రి శ్రీనివాసరావు, మాజీ గవర్నర్ సత్యనారాయణ, వీసీ మల్లారెడ్డి, యూఎస్‌ఏలో వైద్యుడిగా ఉన్న రహమతుల్లా, పౌరహక్కుల సంఘం నేతగా, ఆచార్యుడిగా ఎంతో గుర్తింపు పొందిన హరగోపాల్ సైతం ఈ పాఠశాల విద్యార్థులే..

**అభివృద్ధికి కృషి చేస్తాం - వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్**

ఈ పాఠశాలలోని కొన్ని సమస్యలు దృష్టికి వచ్చాయి. వాటిని తీర్చేందుకు మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తా. సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తా.

**ఎన్నో మధురజ్ఞాపకాలు- ఆచార్య హరగోపాల్, పౌరహక్కుల సంఘం నేత**

ఈ పాఠశాల విద్యార్థిగా ఎన్నో మధుర జ్ఞాపకాలు కళ్లముందు కదలాడతాయి. పాఠశాల అభివృద్ధి కోసం నేను, నా సోదరుడు శ్యాంసుందర్ ఎంతో కృషి చేశాం.


**ఇక్కడ పని చేయడం అదృష్టం- రమేష్‌బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు**

పాఠశాలకు నేను 44వ ప్రధానోపాధ్యాయుడిని. ఉపాధ్యాయుల సహకారంతో మంచి ఫలితాలు సాధించా. ఇటీవల ఇక్కడే పదవీ విరమణ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.

**గర్వపడే జీవితాన్నిచ్చింది.. - రవీందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థి**

ఇక్కడ చదువుకున్నందుకు గర్వపడే జీవితాన్నిచ్చింది. నేర్చుకున్న అక్షరాలు భవిష్యత్తుకు బాటలు వేశాయి. ప్రస్తుతం రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాను.

# నాణ్యతకు తెరలేచే..!




భువనగిరి : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. గతేడాది నుంచి విద్యార్థులకు సులభ రీతిలో పాఠ్యాంశాలను అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. గత ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు మూడు చొప్పున (8,9,10తరగతులకు) 75 అంగుళాలు గల మల్టీపుల్ ఫీచర్స్ డిజిటల్ స్క్రీన్‌లను అందజేసింది. వీటి ధర ఒక్కోటి రూ.3 లక్షలు ఉండగా మూడింటికి కలిపి రూ.9 లక్షల విలువ ఉంటాయి. దీంతో పాటు ఇన్వర్టర్, స్టెబిలైజర్‌లు సరఫరా చేశారు. వీటికి వైఫై, మొబైల్ హాట్‌స్పాట్ సదుపాయం కల్పించింది. ఇందులో ఆడియో, వీడియో, త్రీడి ఇమేజ్‌లను, గూగుల్ సెర్చ్, యూట్యూబ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంది. ఇంతే కాక డిజిటల్ పెన్‌తో స్క్రీన్‌పై రాయవచ్చు. స్క్రీన్ మూసి వేస్తే గ్రీన్ చాక్ బోర్డ్‌గా ఉపయోగించుకోవచ్చు. డిజిటల్ విద్యా బోధన అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పలురకాలుగా మేలు చేకూరుతుంది.

**ఉపయోగం ఇలా..**

8, 9, 10 తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో డిజిటల్ బోధన చేసేందుకు ఈ డివైజ్‌లను ప్రభుత్వం అందజేసింది.దృశ్య, శ్రవణ విధానంలో పాఠాలు బోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతాయి. ఒక్క సారి ఏకాగ్రతతో గమనిస్తే చాలా రోజులు గుర్తుంచుకునే అవకాశం ఉంది. పాఠాలకు సంబంధించిన అధిక సమాచారాన్ని అందించవచ్చు. విద్యార్థులకు బోధించిన పాఠాలను డీసీఎఫ్, డాక్యుమెంట్, జేపీజి ఫార్మాట్‌లో సేవ్ చేసుకునే సదుపాయం ఉంది.

డిజిటల్ బోధన ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి

–కె.సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి, యాదాద్రి భువనగిరి

డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. సాధారణంగా పాఠం వినడం కన్నా టీవీలో దృశ్యాలు చూడడం వల్ల విద్యార్థులు బాగా గుర్తుంచుకోగలుగుతారు. ఇటీవల ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనపై ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. పాఠ్యాంశాలకు సంబంధించిన ఎన్నో విషయాలను బోధించే అవకాశం ఉంటుంది. పదో తరగతిలో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

# డిశ్చార్జికి సిద్ధం.. అనుమతివ్వండి!

హైదరాబాద్: సరూర్‌నగర్ అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్‌కు సంబంధించి గాంధీలో చికిత్స తీసుకుంటున్న కిడ్నీ దాతలు, గ్రహీతలు కోలుకొని డిశ్చార్జికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉంటే కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారు హాస్పిటల్ అక్వైర్డ్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ముప్పు ఉందని వైద్యులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 21న అలకనంద ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ ఉదంతం బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. కిడ్నీలు దానం చేసిన తమిళనాడుకు చెందిన మహిళలు భాను(22), ఫిర్దోస్(40)తోపాటు కిడ్నీ గ్రహీతలు కర్ణాటకకు చెందిన న్యాయవాది బీఎస్ రాజశేఖర్(68), నర్సు ప్రభాభట్ అలియాస్ కృపాలత(40)లను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు 5 రోజుల క్రితమే ఈ నలుగురికి సర్జరీలు చేశారు. అప్పటి నుంచి గాంధీలో చికిత్స అందిస్తున్నారు. వాస్తవానికి కిడ్నీ మార్పిడి శస్త్ర




చికిత్స తర్వాత గరిష్ఠంగా వారం రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. తర్వాత వారిని డిశ్చార్జి చేస్తారు. ఆసుపత్రిలో ఎక్కువ రోజులుండడం వల్ల ఇన్‌ఫెక్షన్ల ముప్పు తప్పదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

**వ్యాధి నిరోధక శక్తి తగ్గించేందుకు..**

కిడ్నీ మార్పిడి తర్వాత కొందరిలో తిరస్కరణ, ఇన్‌ఫెక్షన్ల ముప్పు ఉంటుంది. శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి ఇందుకు కారణం. అవయవ మార్పిడి తర్వాత కొత్తగా పెట్టిన అవయవాలు తిరస్కరణకు గురికాకుండా గ్రహీతల్లో వ్యాధి నిరోధక శక్తిని తగ్గించేందుకు ఇమ్యూనో సప్రెస్ మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలి.

**తదుపరి ఆదేశాల కోసం...**

ఇలాంటి మెడికో లీగల్ కేసుల్లో తదుపరి ఆదేశాల వచ్చే వరకు వైద్యులు సొంతంగా డిశ్చార్జి చేయలేని పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత కిడ్నీ కేసులకు సంబంధించి ఇప్పటికే గాంధీ నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించారు.

# మామిడి మార్కెట్‌కు మోక్షమెన్నడో..!

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు అడుగులు పడటం లేదు. ఏళ్ల నుంచి ఇక్కడ విపణి లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇతర ప్రాంతాల్లో విక్రయించినా రవాణా ఖర్చులు భారం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. చేసేది లేక మామిడి రైతులు స్థానికంగానే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

**11,829 ఎకరాల్లో సాగు**

జిల్లాలో 3,657 మంది రైతులు 11,829 ఎకరాల్లో మామిడి సాగు చేశారు. ప్రస్తుతం పంటలన్నీ కాయ దశలో ఉన్నాయి. మరో రెండునెలల్లో పంట కోతకు వస్తుంది. జిల్లా రైతులు తమ పంటను ఖమ్మం, విజయవాడ, గుంటూరుకు తీసుకెళ్లాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చుల భారం పెరుగుతోంది. లేకుంటే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని



జనగామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కేంద్రాలలో విక్రయిస్తున్నారు. దీనికితోడు కూలీలు, పెట్టుబడులు పోను గిట్టుబాటు కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువగా కోదాడ నియోజకవర్గంలో అధికంగా రైతులు మామిడి సాగు చేశారు. స్థానికంగా మార్కెట్ లేకపోవటం, మద్దతు ధర దక్కపోవడంతో చాలామంది రైతులు మామిడి పంటలను తగ్గించారు. ఇప్పటికైనా అధికారులు మామిడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తాం– నాగేశ్వర శర్మ, జిల్లా మార్కెటింగ్ అధికారి, సూర్యాపేట

జిల్లాలో మామిడి మార్కెట్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఏర్పాటుకు అనుమతులు వస్తే వెంటనే అనువైన స్థలం చూసి ఏర్పాటు చేస్తాం.

# మళ్లీ ముహూర్తాలొచ్చాయ్

యాదగిరిగుట్ట : పుష్య మాసం ముగిసి, మాఘ మాసం ఆరంభంతో శుక్రవారం (ఈనెల 31) నుంచి కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. శుభ ముహూర్తాలకు తెర తొలగి, పెళ్లి బాజా, భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మాఘ, ఫాల్గుణ మాసాలలో 25 శుభ ముహూర్తాలున్నట్లు యాదగిరి క్షేత్రంలోని ఆలయ పూజారులు, పంచాంగకర్తలు, బ్రాహ్మణులు చెబుతున్నారు. దీంతో వివాహాలు కుదుర్చుకునే పర్వాలలో పెళ్లి చూపులు, మాటా ముచ్చట్లు ముమ్మరమయ్యాయి. ఈ నెల 31 నుంచి శుభ పర్వాలు మొదలై, మార్చి 6 వరకు పెళ్లి తతంగాలు జరుపుకోవచ్చు.

మాఘ మాసంలో.. జనవరి 31 నాటి ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలు, ఫిబ్రవరి 2న ఉదయం, రాత్రి 7వ తేదీ ఉదయం, రాత్రి, 13న ఉదయం, 14న రాత్రి, 16, 20 తేదీల్లో మూడు వేళల్లో, 22, 23న కూడా రెండేసి ముహూర్తాలున్నాయి.

ఫాల్గుణంలో.. వచ్చే మార్చి నెల 2న ఉదయం రెండు, రాత్రి రెండు ముహూర్తాలు, 6వ తేదీన మూడు వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లు పంచాంగకర్తలు తెలిపారు.

సందడి షురూ.. ముహూర్తాలు సమీపించడంతో పెళ్లి పెద్దలు ఒకవైపు.. కుటుంబ సభ్యులు మరోవైపు ఏర్పాట్లపై వ్యూహ రచనకు దిగారు. కొనుగోలు,వంటలు, ఫొటో షూట్, రాకపోకల కోసం ఇరు కుటుంబాల చర్చలు సాగుతున్నాయి. మ్యారేజీ హాళ్లు హంగామాలతో రూపు దిద్దుకుంటున్నాయి.

# డొక్కు వాహనాలు తుక్కు.. కొత్త వాటికి రాయితీ

కరీంనగర్ : వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్ లోపల 2027 వరకు డీజిల్ ఆటోలు, బస్సులను తిరగకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. మరో వైపు 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలని ప్రభుత్వం స్క్రాపింగ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. వాహనాలను తుక్కుగా మార్చి.. కొత్త వాటిని కొనే సమయంలో జీవితకాలపు పన్నుపై రాయితీని ప్రకటిస్తూ జీవో 28ని జారీ చేసింది. ఆ జీవోతో ఎవరికి ఎంత ప్రయోజనమో కథనం.

**నూతన విధానం ఇలా..**

నూతన పాలసీ ప్రకారం 15 ఏళ్లు దాటిన తమ వాహనాలను తుక్కుగా మార్చి.. అదే రకమైన కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే వాహనం ధరను బట్టి జీవితకాలపు పన్నులో రాయితీ ఇస్తుంది. అయితే ముందుగా రవాణా శాఖకు సమాచారమిచ్చి అధీకృత రిజిస్టర్ వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ కేంద్రానికి వెళ్లి వాహనాన్ని తుక్కుగా మార్చుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆ కేంద్రం జారీ చేసే ధ్రువపత్రాన్ని తీసుకెళ్లి.. షోరూం నిర్వాహకులకు చూపిస్తే పన్ను రాయితీ ఇస్తారు. ఇది రవాణేతర వాహనాలకు వర్తిస్తుంది. ఈ విధానం నోటిఫికేషన్ జారీ అయిన రెండేళ్ల వరకు (సెప్టెంబరు 2026) అమల్లో ఉంటుందని



ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

**స్క్రాపింగ్ కేంద్రాల ఏర్పాటుకు అడుగులు..**రాష్ట్ర ప్రభుత్వం వాహనాలను తక్కుగా మార్చే రిజిస్టర్ వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్‌వీఎస్‌ఎఫ్) కేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. మొదట హైదరాబాద్, రంగారెడ్డిలో అందుబాటులోకి తెస్తున్నట్లు సమాచారం. అవసరాన్నిబట్టి విడతల వారీగా వీటిని కామారెడ్డి, కరీంనగర్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారని సమాచారం. అన్ని జిల్లాలో ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే వాహనదారులకు సేవలు అందుబాటులో ఉంటాయి.

**విధి విధానాలపై స్పష్టత..**

వాహనాలను తుక్కుగా మార్చితే కొత్తగా కొనుగోలు చేసిన వాహనంపై ఇచ్చే జీవితకాలపు రాయితీకి సంబంధించిన విధి విధానాలు వచ్చాయి. తుక్కు మార్చే కేంద్రాల ఏర్పాటుపై సమాచారం లేదు. పైలెట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్, రంగారెడ్డిలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దశల వారీగా ఇతర జిల్లాలకూ విస్తరిస్తారని తెలిసింది. పెద్దింటి పురుషోత్తం, డీటీసీ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

# హరితం.. అభయం

సిరిసిల్ల : అటవీ మైదాన ప్రాంతాల్లో ఏటా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ సత్ఫలితాలను ఇస్తోంది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్–2023'ని రెండు రోజుల కిందట విడుదల చేసింది. ఈ నివేదికలో ఉమ్మడి జిల్లాలో ఏకంగా 71.79 చదరపు కిలోమీటర్లలో అదనపు పచ్చదనం విస్తరించింది. దీనిలో జగిత్యాల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అటవీ అగ్నిప్రమాదాలు జగిత్యాల జిల్లాలో 455, పెద్దపల్లిలో 177, రాజన్న సిరిసిల్లలో 170, కరీంనగర్‌లో ఒకటి జరిగాయి. పర్యావరణ సమతుల్యత ప్రకారం 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. కాగా ఉమ్మడి జిల్లాలో 23.14 శాతం ఉంది. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం పెరుగుతున్నా మైదాన ప్రాంతాల్లో పోడు పేరుతో ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. వీటిని అరికట్ట గలిగితేనే పెరిగిన పచ్చదనం లక్ష్యం నెరవేరుతుంది.

**ఆక్రమణలు ఇలా...**

ఉమ్మడి జిల్లాలో అటవీ భూముల ఆక్రమణ నానాటికీ పెరిగిపోతోంది.



అటవీ ప్రాంతంలోని భూములు ఉన్న రైతులు హద్దుల్లో ఉన్న అటవీ భూమిని తమ పొలాల్లో కలుపుకుంటూ పోతున్నారు. ఫలితంగా రెవెన్యూ పట్టాల్లో ఉన్న విస్తీర్ణానికి మించి అక్కడ భూమి ఉంటోంది. ప్రభుత్వం పోడు పట్టాలు పంపిణీ చేసినప్పటి నుంచి ఆక్రమణలు మరింత పెరిగాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చందుర్తి–మల్యాల అటవీ సెక్షన్లలో చందుర్తి మండలం సనుగుల, దేవునితండా, జగదాంబతండా, రుద్రంగి మండలంలో గువ్వలతండా, కుక్కలగండి, వీరునితండా, దసరానాయక్‌తండా, కోనరావుపేట మండలం శివంగళపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, వీర్నపల్లి మండలం కంచర్లలో వేలాది ఎకరాల్లో చెట్లను నరికి మైదానాలుగా మార్చేశారు.

జగిత్యాల జిల్లా సారంగపూర్, బీర్‌పూర్ అటవీ ప్రాంతంలో 2006లో అప్పటి ప్రభుత్వం 680 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసింది. ప్రస్తుతం ఈ భూముల చుట్టూ ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. గతేడాది అటవీ అధికారులు 4 వేల ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వాస్తవానికి ఇక్కడ 9 వేల ఎకరాలకు పైనే ఉంటుందని అంచనా. పెద్దపల్లి జిల్లాలో కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాల్లోని అటవీ ప్రాంతంలోనూ సమీప రైతులు ఏటా కొంత కలుపుతూ వెళ్తున్నారు. అటవీ ఆక్రమణల నుంచి రక్షణకు మొక్కలు నాటడం, కందకాలు తీయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నా అవి పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వడం లేదు. వర్షాకాలం సీజన్‌లో అటవీ మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు వెళ్తున్న అటవీ అధికారులపై గిరిజనులు తిరగబడటం, నాటిన మొక్కలను ధ్వంసం చేసి సాగు చేయడం వంటి ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఆక్రమణలపై అటవీశాఖ కఠినంగా వ్యవహరించినప్పుడే పెరిగిన పచ్చదనం కాపాడటం సాధ్యమవుతుంది.

# పంచాయతీలకు ట్రాక్టర్లు భారం



కొణిజర్ల : పంచాయతీల్లో పరిశుభ్రతే లక్ష్యంగా చెత్తసేకరణ కోసం గత ప్రభుత్వంలో ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా ట్రాక్టరుతోపాటు ట్రక్కు, ట్యాంకర్‌లను తీసుకున్నారు. వాటితో చెత్త సేకరణతోపాటు, మొక్కలకు నీటిని సరఫరా చేశారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో ట్రాక్టర్ కిస్తీలతోపాటు నిర్వహణ సక్రమంగా ఉండేది. ప్రత్యేక పాలన వచ్చిన తర్వాత పంచాయతీలకు నిధులు రాకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ట్రాక్టర్ల మరమ్మతులు చేయించలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో కొన్ని నెలలుగా చెత్తసేకరణ నత్తనడకన సాగుతుండగా, చిన్న పంచాయతీల్లో పూర్తిగా నిలిచిపోయింది. కిస్తీలు చెల్లించలేక, మరమ్మతులు చేయించలేని పరిస్థితి ఉండటంతో పల్లెల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.

**మరమ్మతులు చేయించలేక...**

ఖమ్మం జిల్లాలో 584 పంచాయతీలుండగా అన్నిచోట్ల చెత్తసేకరణ కోసం ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటికి సంబంధించిన కిస్తీలు ప్రతినెలా రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు చెల్లించాల్సి ఉండగా పంచాయతీల్లో నిధుల్లేక ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీల్లో ఉన్న కొద్ది నిధులు పారిశుద్ధ్య పనులకే సరిపోతుండటంతో మిగతా పనులకు ఆటంకంగా మారింది. ట్రాక్టర్లను తీసుకుని అయిదేళ్లు కావడంతో తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేయించాలంటే రూ.30 వేల వరకు ఖర్చవుతుండటంతో పంచాయతీలకు భారంగా మారింది. కనీసం డీజిల్‌కు నగదులేక పల్లెల్లో వారానికి ఒకసారి మాత్రమే చెత్తసేకరణ చేస్తున్నారు. కార్యదర్శులు డీజిల్‌కు సొంత నగదు ఖర్చు చేస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో డీజిల్, కిస్తీలకు సంబంధించిన నగదును సర్దుబాటు చేస్తున్నా.. చిన్న పంచాయతీల్లో మాత్రం ట్రాక్టర్లను తిప్పలేని పరిస్థితి ఉంది.

**ఆటంకాలను అధిగమించి.. చెత్త సేకరణ**

పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణకు సంబంధించి నిధుల కొరత ఉంది. ప్రభుత్వం నుంచి ఏ నిధులు వచ్చినా మొదటి ప్రాధాన్యం ట్రాక్టర్లకు ఇస్తున్నాం. ఏదో రకంగా చెత్తను సేకరిస్తూ గ్రామాలను స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.
చంద్రశేఖర్, డీఎల్‌పీఓ, కల్లూరు

**ఎక్కడ చూసినా ఇబ్బందులే..**

కొణిజర్ల మండలం ఉప్పలచెలక పంచాయతీలో రెండు నెలల క్రితం ట్రాక్టర్‌ను మరమ్మతుల నిమిత్తం తీసుకువెళ్లారు. రూ.30 వేల వరకు ఖర్చు వస్తుండటంతో పంచాయతీలో నిధుల్లేక అధికారుల పట్టించుకోవడం లేదు.

కల్లూరు మండలం మర్లపాడు, పోచారంలో ట్రాక్టర్ల మరమ్మతులకు గురవడంతో చెత్తసేకరణ నిలిచిపోయింది.

వేంసూరు మండలంలో 20 పంచాయతీల్లో కొన్ని నెలలుగా ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తల్లాడ మండలం మంగాపురం, రామానుజవరం, బాలపేట, తెలగారంలో ట్రాక్టర్ల కిస్తీలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

కల్లూరు మండలం పుల్లయ్యబంజర, కప్పలబంధం, బత్తుపల్లి, మరో నాలుగైదు పంచాయతీల్లో నిధుల్లేక కిస్తీలు చెల్లించలేని దుస్థితి.

వైరా, మధిర, పాలేరు నియోజకవర్గంలోని చిన్న పంచాయతీల్లో నిధుల్లేక ట్రాక్టర్లను చెత్తసేకరణ జరగడం లేదు. కార్యదర్శులు డీజిల్ ఖర్చును భరించి కొంత వరకు చెత్త సేకరణ చేస్తున్నా.. చిన్న పంచాయతీల్లో మాత్రం చేతులెత్తేశారు.

# ప్రసవాలా.. అయితే.. సర్వజనాసుపత్రికే!



ఖమ్మం : మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తోంది. పట్టణాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఈ భారమంతా పెద్దాసుపత్రిపై పడుతోంది. వాస్తవానికి సాధ్యమైనంతవరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో కాన్పులు నిర్వహించాలి. కానీ, హైరిస్క్ కాకపోయినా చాలా కేసులను పెద్దసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తున్నట్లు సమాచారం.

**కనీసం పదికిపైగా..**

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రతి పీహెచ్‌సీలో నెలకు కనీసం పది వరకు కాన్పులు నిర్వహించాలి. జిల్లాలోని 26 పీహెచ్‌సీల్లో 24 గంటల సేవలందించే ఆసుపత్రులు ఎనిమిది ఉన్నాయి. వీటిల్లో ఒక్కో ఆసుపత్రిలో నెలకు పది చొప్పున ప్రసవాలు జరిగినా.. ఏడాదికి 120 వరకు చేయవచ్చు. కానీ అన్ని ఆస్పత్రుల్లో కలిపి ఏడాది మొత్తం 22 నుంచి 40కి మించి ఎక్కడా కాన్పులు చేయలేదు. మిగిలిన చోట్లచూస్తే.. బోనకల్లు, గంగారం కేంద్రాల్లో మాత్రమే 50 వరకు ప్రసవాలు జరిగాయి. మిగతా వాటిల్లో 30కి లోపే కాన్పులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో కూసుమంచి, మంచుకొండ, మాటూరుపేట, నేలకొండపల్లి, సుబ్లేడు, ముదిగొండ వల్లభి కేంద్రాల్లో జరిగిన కాన్పులు పది లోపే.

**సీహెచ్‌సీల్లోనూ అంతంతే..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో ప్రసవాల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా కాన్పులు పెరగడం లేదు. కల్లూరులో ఏడాదిలో ఒక్క కాన్పు మాత్రమే చేశారు. తిరుమలాయపాలెంలో 5, మధిరలో 26, నేలకొండపల్లిలో 18, పెనుబల్లిలో 146, సత్తుపల్లిలో 328 కాన్పులు జరిగాయి. వైద్య సిబ్బందితో పాటు.. బర్త్‌ప్లాన్ తయారు చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది సైతం తమ పనిని సులువు చేసుకునేందుకు అత్యధిక హైరిస్క్ కేసులుగా చూపుతున్నారని సమాచారం. ఫలితంగా పెద్దాసుపత్రి ఎంసీహెచ్‌లోని వార్డుల్లో మంచాలు సరిపోక వరండాలో పడకలు ఏర్పాటు చేసి బాలింతలకు చికిత్స అందిస్తున్నారు.

పీహెచ్‌సీల్లో రిస్క్ లేని మొదటి కాన్పు కేసులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి కేసును సర్వజనాసుపత్రికి పంపాల్సిన అసవరం లేదు. అన్ని కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య ఇంకా పెంచాలి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సాధారణ కాన్పులను పెంచేందుకు గర్భిణులకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ఆయుష్ విభాగం తరపున 19 మంది శిక్షకులను నియమించడం జరిగింది.
– డాక్టర్ సైదులు, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి

# చాపకింద నీరులా గంజాయి వ్యాపారం

ఖమ్మం : సిబ్బంది కొరత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో సమర్థవంతంగా గంజాయి రవాణాదారుల ఆట కట్టించలేకపోతున్నారు. ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలకు తెచ్చిన ఓ జాగిలం పక్కనున్న భవనంపై పూల కుండీల్లో పెంచుతున్న గంజాయిని కనిపెట్టింది. ఇటువంటి జాగిలాల వ్యవస్థ ఆబ్కారీశాఖ వద్ద లేదు. వాహనాలు విప్పి లోపలి భాగాల్లో, రైళ్లలో కొత్తకొత్త పద్ధతుల్లో గంజాయి తరలిస్తుండగా.. నిలువరించడం ఆబ్కారీ అధికారులకు తలకుమించిన భారంగా పరిణమిస్తోంది.

**ట్రాకింగ్ వ్యవస్థ ఏదీ!**

గంజాయి తరలుతోందని సమాచారమందితే వాహనాన్ని ట్రాక్ చేసే వ్యవస్థ ఆబ్కారీశాఖ వద్ద లేదు. పోలీసుశాఖ సహకారం కోరడం.. వారు సహకరిస్తే సరి లేకుంటే ముఠా వీరి కనుసన్నల్లోంచి సులువుగా జారుకుంటోంది. ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పలు ముఠాలను పట్టుకొంది. నిందితులు ఎక్కువగా పాతబడిన వాహనాలు ఉపయోగిస్తారనే ఉద్దేశంతో వాటిని తనిఖీ చేసి పట్టుకున్న కేసులే ఎక్కువ. గంజాయి ద్రవరూపంలోకి మార్చి, వివిధ మార్గాల్లో, నూనె డబ్బాల లోడులా సరఫరా చేస్తున్నారు. కొత్త వాహనాల్లోనూ సరకు తరలిస్తున్నట్లు ఇటీవల సంఘటనలు నిరూపిస్తున్నాయి.

**సిబ్బంది, వాహనాల కొరత**

తనిఖీల్లో ఎస్సైలు, సిబ్బందిదే ప్రధాన భూమిక. ఎస్సైల కొరత తీవ్రంగా ఉంది. 9 మంది ఎస్సైలు మాత్రమే ఉన్నారు. గంజాయి ఎక్కువగా పట్టుబడే ఖమ్మం–2 స్టేషన్‌లో ఒక్కరూ లేరు. శాఖలో అన్ని అద్దె వాహనాలే ఉన్నాయి. ఏడాదిన్నరగా వాటికి చెల్లింపులు లేవు. తనిఖీలు అంతంతగానే కొనసాగుతున్నాయి. శాఖ పరిస్థితిని జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి ముందు ఉంచగా జాగిలాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని, ఇది చాలా వ్యయప్రయాసలతో కూడిన అంశమన్నారు. సిబ్బంది కొరత ఉందని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తామని చెప్పారు.



**పిల్లలే కొరియర్లు**

గంజాయి అక్రమార్కులు తాజాగా సరఫరా కోసం మైనర్లను రంగంలోకి దింపారని పలు కేసులు రుజువు చేశాయి. గంజాయి రవాణాకు అనువైందనే పేరు పడ్డ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎప్పుడు సోదాలు చేసినా కిలో నుంచి అయిదు కిలోలకు తగ్గకుండా సరకు పట్టుబడుతోంది. ఇప్పుడీ రైళ్లల్లో మైనర్లతో సరకును రవాణా చేస్తుండగా వారిని పట్టుకుంటే అనుసరించాల్సిన పద్ధతులు, తక్షణం వారిని సంరక్షించడం సమస్యగా మారుతోందని, మైనర్లను వదిలేసి దొరికినంత సరకును పట్టుకొచ్చి నిందితుల ఆచూకీ కోసం వెతుకుతున్నామని చెప్పడం అలవాటుగా మార్చుకున్నారు.

ఆబ్కారీ స్టేషన్లు: 7
నవంబరు వరకు పట్టుకున్న కేసులు: 84
పట్టుబడ్డ నిందితులు: 90
సీజ్ చేసిన సరకు: 792 కిలోలు
స్వాధీనం చేసుకున్న వాహనాలు: 14

# బస్సుల కొరత గమ్యం చేరేదెలా?

మంథని: మంథని ఆర్టీసీ బస్సు డిపో లాభాల బాటలో నడుస్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 1996లో 40 బస్సులతో ప్రారంభమైన ఈ డిపోలో బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పెరగకపోవడం సమస్యగా మారింది. డిపో నుంచి 31 ఆర్టీసీ, 21 అద్దె బస్సులు కలిపి మొత్తం 52 బస్సులు నడుపుతున్నారు. మంథని ఆర్టీసీ డిపో గత నవంబరు 30 వరకు రూ.5.12 కోట్ల లాభాల్లో ఉంది. ఇటీవల నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు రూట్లలో నైట్ హాల్ట్ బస్సులు పునరుద్ధరించాలని కోరారు. బస్సుల సంఖ్య పెంచాలన్న డిమాండ్ కూడా పెరిగింది.

**విన్నపాలు ఇవీ..**గతంలో ఉప్పట్ల, నాగెపల్లి, చంద్రాపూర్(మహారాష్ట్ర), వేములవాడలకు బస్సులు నడిపేవారు.. ఆరెంద, తాడిచెర్ల గ్రామాలకు నైట్‌హాల్ట్ బస్సులు నడిచేవి. జమ్మికుంట, కాళేశ్వరం నుంచి వేములవాడకు బస్సులు నడపాలని.. ఆరెంద, తాడిచెర్లకు నైట్‌హాల్ట్ బస్సులు నడుపాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు. గోదావరిఖని నుంచి మంథనికి రాత్రి 8 గంటల తర్వాత, కరీంనగర్ నుంచి మంథనికి 8.30–10 గంటల మధ్య బస్సు సౌకర్యం లేదు. మంథని నుంచి చంద్రాపూర్‌కు బస్సు సర్వీసు నిలిపివేయడంతో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో బొగు గనుల్లో పని చేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో మంథని డిపో బస్సుల్లో ప్రయాణికులు సంఖ్య 60శాతం నుంచి 90 శాతానికి పెరిగింది.

మంథని డిపోకు కరీంనగర్, పెద్దపల్లి, హైదరాబాద్, గోదావరిఖని, భూపాల్‌పల్లి రూట్లలో అధిక ఆదాయం వస్తుంది. పల్లెవెలుగు బస్సులు నడిచే ఆరెంద, తాడిచెర్ల, పెద్దతూండ్ల, ఓడెడ్ రూట్లలో కనీసం డీజిల్ ఖర్చు కూడా రావడం లేదని డీఎం చెబుతున్నారు.

**అదనపు బస్సులు వస్తే నడుపుతాం** ప్రయాణికుల రద్దీ అనుగుణంగా ఆ రూట్‌లో బస్సులు నడుపుతున్నాం. చంద్రాపూర్‌కు త్వరలోనే బస్సు నడుపుతాం. జమ్మికుంటకు నడపడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. గోదావరిఖని నుంచి మంథనికి రాత్రిపూట బస్సు నడపడానికి సమయాల్లో మార్పు చేస్తాం. రాత్రి కరీంనగర్ నుంచి మంథనికి బస్సులు ఆలస్యంగా రాకుండా చర్యలు తీసుకుంటాం. డిపోకు అదనపు బస్సుల వచ్చిన తర్వాత ప్రయాణికులు కోరిన రూట్లలో బస్సులు నడుపుతాం. శ్రావణ్‌కుమార్, మంథని ఆర్టీసీ డీఎం

# నిధులున్నా పనుల్లో జాప్యం

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీరడం లేదు. అటవీ ప్రాంతాల గుండా రహదారుల నిర్మాణాలకు ఆ శాఖ అభ్యంతరాలు చెబుతోంది. దీంతో నిధులున్నా నిర్మాణాలు చేపట్టలేని దుస్థితి నెలకొంది. గ్రామీణుల ప్రయాణం దూరాభారం అవుతోంది. దీనికితోడు అసంపూర్తి రహదారుల్లో అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు రాజన్న ఆలయానికి చేరుకోవాలంటే కోరుట్ల, జగిత్యాల మీదుగా 35 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంది. చందుర్తి – మేడిపల్లి మండలం మోత్కురావుపేట రహదారికి 3.5 కిలోమీటర్లు అటవీ ప్రాంతం ఉంది. దీనిలో రహదారి నిర్మాణానికి ఇటీవల మొదటి దశ అనుమతులు లభించాయి. అటవీ ప్రాంతంలో రహదారి నిర్మాణం పూర్తయితే వేములవాడకు 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

సిరిసిల్ల నియోజకవర్గంలో తంగళ్లపల్లి–ముస్తాబాద్ మండలాలను కలిపేందుకు జిల్లెల్ల మీదుగా రెండు వరుసల రహదారి నిర్మాణానికి 2018లో రూ.5 కోట్లు మంజూరయ్యాయి. వీటితో జిల్లెల్ల శివారు భగత్‌నగర్, ముస్తాబాద్ వైపు తెర్లుమద్ది వరకు రహదారి పనులు పూర్తయ్యాయి. భగత్‌నగర్ నుంచి తెర్లుమద్ది శివారు వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో ఈ రెండు మండలాల వారు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, తంగళ్లపల్లి మండలం మండెపల్లి మీదుగా తిరిగి వెళ్తున్నారు.

సిరిసిల్ల– నిజామాబాద్ జిల్లాలను కలిపే మరిమడ్ల–మానాల రహదారికి నాలుగేళ్ల క్రితం రూ.8.5 కోట్లు మంజూరయ్యాయి. 8 కిలోమీటర్ల రహదారి పూర్తిగా అటవీ ప్రాంతం నుంచి వెళ్తుంది. దీనిలో నాలుగు కిలోమీటర్ల మేరకు మొదటి దశ అటవీ అనుమతులు వచ్చాయి.



కొంతమేరకు మట్టి పనులు కూడా జరిగాయి. మరో నాలుగు కిలోమీటర్ల పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సిరిసిల్ల నుంచి జిల్లావాసులు 35 కిలోమీటర్లలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు.

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని శివారు మండలాలు వీర్నపల్లి, కోనరావుపేటకు ఎగ్లాస్‌పూర్ మీదుగా రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ మార్గంలో కంచర్ల వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తయింది. దాని తర్వాత 1.5 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణం ఏడేళ్లుగా ముందుకు సాగడం లేదు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య 12 కిలోమీటర్లలో రాకపోకలు సులభమవుతాయి. అలాగే వీర్నపల్లి మండలం మద్దిమల్ల నుంచి కామారెడ్డి వెళ్లేందుకు మాచారెడ్డి మండలం సోమరిపేట గ్రామ పరిధిలోని బంజేరుపల్లితండాలో రెండు కిలోమీటర్ల మేరకు అటవీ అనుమతులు రాక రహదారి అసంపూర్తిగా ఉంది. ఈ రహదారి పూర్తయితే వీర్నపల్లి నుంచి 30 కిలోమీటర్లలో కామారెడ్డి చేరుకోవచ్చు. ఎల్లారెడ్డిపేట మీదుగా 55 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి.

కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలను కలిపే రహదారిలో అక్కపల్లి శివారు అటవీ ప్రాంతంలో దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉంది. ఈ రెండు మండలాల శివారు గ్రామాల వారు మండల కేంద్రాలకు వెళ్లాలంటే వ్యయ,ప్రయాసలు తప్పడం లేదు. అసంపూర్తి రహదారులతో ఈ గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేదు.

**పనుల పూర్తికి చర్యలు**

రవాణా సౌకర్యం మెరుగుపడితేనే ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. చందుర్తి– మోత్కురావుపేట రహదారికి మొదటి దశ అటవీ అనుమతులు వచ్చాయి. వారికి డబ్బులు చెల్లించి పనులు ప్రారంభిస్తాం. జిల్లెల్ల, ముస్తాబాద్ రహదారికి అనుమతులు రావాల్సి ఉంది. మరిమడ్ల, మానాల రహదారితోపాటు మిగతా అటవీ అనుమతుల్లేక నిలిచిన పనులను పరిశీలించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. వెంకటరమణయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ




దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. రేపటి బడ్జెట్‌లో పేద, మధ్యతరగతితో పాటు మహిళలకు పెద్దపీట వేస్తారన్న అంచనాలు పెంచేందుకు కారణమయ్యాయి. పేదలు, మధ్యతరగతిపై మహాలక్ష్మి కటాక్షం చూపించాలంటూ ఆయన పేర్కొనడం ఇందుకు నేపథ్యం. దీంతో పాటు సమ్మిళిత అభివృద్ధి పెట్టుబడులు, ఆవిష్కరణలే లక్ష్యంగా దూసుకెళుతున్నామని ఆయన పేర్కొనడంతో ప్రజాకర్షక పథకాలకు ఈసారి పెద్దపీట వేస్తారన్న అంచనాలు నెలకొన్నాయి. వృద్ధికి ఊతం ఇచ్చేలా మధ్యతరగతికి పన్ను ప్రయోజనాలు, మహిళలకు సంబంధించిన పథకాలు ప్రకటించొచ్చన్న ఆశలు రేపాయి. బడ్జెట్ వచ్చిన ప్రతిసారీ ఆదాయపు పన్ను ఊరట కల్పిస్తారంటూ వేతన జీవుల ఆశగా ఎదురుచూస్తుంటారు. అయితే వృద్ధి నెమ్మదించిన నేపథ్యంలో ఈసారి మార్పులు ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరణ, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు, రిబేట్ పెంపు వంటి అంశాలపై ఉద్యోగులు ఆశపెట్టుకున్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలు ఒకవేళ బడ్జెట్‌లో ప్రతిఫలిస్తే మధ్యతరగతికి పెద్ద శుభవార్తే అవుతుంది. మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పథకాలు ఈసారి బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం ఉందన్న విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళలకు నైపుణ్య శిక్షణ కల్పించండంతో పాటు జన్‌ధన్ యోజన, ముద్ర యోజన వంటి పథకాలు కేటాయింపులు పెంచడం వంటివి చేయొచ్చని భావిస్తున్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ గడువు ఈ మార్చితో ముగియనుండడంతో దాన్ని కొనసాగించడం, లేదా కొత్త పథకాన్ని తీసుకురావొచ్చని భావిస్తున్నారు. పేదలకు సంబంధించి ఇప్పటికే ఉచిత ఆహార ధాన్యాలు, పీఎంఏవై, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి పథకాలు అమలవుతున్నాయి. వీటిని కేటాయింపులు పెంచడంతో పాటు సామాజిక భద్రతను మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరి ప్రధాని మోదీ వ్యాఖ్యలు బడ్జెట్‌లో ప్రతిబింబిస్తాయా? లేదా? అన్నది మరికొన్ని గంటల్లో తెలిసిపోతుంది.




విజయవాడ: ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావుకు పదవీ విరమణ వీడ్కోలు పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "నా జీవితంలో ఇవి ఉద్విగ్నభరిత క్షణాలు.

యూనిఫామ్ ఇకపై ఉండదంటేనే భావోద్వేగంగా ఉంది. సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక సవాళ్లు చూశా. సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారాం. సైబర్ క్రైమ్, గంజాయి, చిన్నారులపై నేరాల విషయంలో చర్యలు చేపట్టాం. విపత్తుల సమయంలో ఏపీ పోలీసులు సాహసోపేతంగా పనిచేశారు. ప్రభుత్వ సహకారం వల్లే పోలీసు వ్యవస్థను బలోపేతం చేశాను" అని వివరించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా మాట్లాడారు. తిరుమలరావు పోలీసు శాఖలో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ప్రజల భద్రత, సేఫ్టీ కోసం అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

" నూతన డీజీపీగా నా శక్తిమేర పనిచేస్తా. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతాం. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అస్త్రం యాప్ ట్రాఫిక్ నియంత్రణలో ఓ మైలు రాయి" అని హరీశ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు.

## ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన: నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి: ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎన్డీయే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి ఎన్డీయే పక్షాలు సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసుకుని పని చేయాలన్నారు. "తొలిసారి గెలిచిన, కొత్తగా వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలి. రాత్రికి రాత్రే అన్నీ జరిగిపోతాయని మనం చెప్పట్లేదు. గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 16,347 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నాం. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఫలితాలను వెల్లడించనున్నారు.




## వారి తెలివితేటలతో అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పశ్చిమగోదావరి , జనవరి 31: జిల్లాలోని పెనుగొండలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కలియుగ పార్వతీదేవిగా అహింసా, శాంతి, సంపద గురించి చాటి చెప్పిన దేవతా వాసవి కన్యకా పరమేశ్వరి అని అన్నారు. 2600 ఏళ్ల క్రితం అహింస జరగకూడదని 102 మంది గోత్రీకులతో ఆత్మార్పణ చేసుకున్న మహిమాన్వితురాలు వాసవి కన్యకాపరమేశ్వరి అని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆర్యవైశ్యులే కాకుండా అందరి భక్తుల మన్ననలు పొందుతున్న ఏకైక దేవత వాసవి కన్యకా పరమేశ్వరి అని చెప్పారు. తొలిసారిగా వాసవి కన్యక పరమేశ్వరి అమ్మ వారిని దర్శించుకోవడం ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆర్యవైశ్యులు సమాజంలో కష్టపడి పనిచేసి నీతి నిజాయితీగా సంపాదించిన సంపాదనలో సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేయటం వారి రక్తంలోనే ఉందన్నారు. ఆర్యవైశ్యులు ధనాన్ని ధర్మ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమని కొనియాడారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి తెలివితేటలతో అభివృద్ధి పరచాలన్నది ప్రభుత్వ ధ్యేయమని చెప్పుకొచ్చారు. ప్రజల కోసం ప్రభుత్వం వాట్సప్ గవర్నర్స్ ప్రారంభించామని తెలిపారు. ఫోన్లలో పోస్టు చేసిన మెసేజ్‌కు తక్షణమే సమాధానం ఇస్తామన్నారు. 2047 విజన్ 2.0 స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది ఆర్యవైశ్యులే అని వెల్లడించారు. రాష్ట్రాన్ని చల్లగా చూడాలని ఆ కన్యకా పరమేశ్వరుని మొక్కుకున్నానన్నారు. అమ్మ ఆశీస్సులతో ఈ పెనుగొండ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కాగా.. ఉండవల్లి నివాసం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పెనుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎంకు నేతలు ఘన స్వాగతం పలికారు.




## ఏపీలో పెరగనున్న భూముల విలువ.. రిజిస్ట్రేషన్ కోసం జనం బారులు

శనివారం నుంచి ఏపీలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్న వేళ ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ నెలకొంది. పలు జిల్లాల నుంచి ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. దీంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. సకాలంలో రిజిస్ట్రేషన్లు అవ్వకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.




అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ ప్రక్రియ చేపడతామన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉమ్మడి ఏపీ, నవ్యాంధ్రలో 80 శాతం టీచర్ల నియామకం చేపట్టింది తెదేపానే అని గుర్తు చేశారు.

"ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నాం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటున్నాం. విద్యా శాఖ కమిషనర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలు వింటున్నారు. టీచర్ల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు 'ట్రాన్స్‌ఫర్ యాక్ట్' తీసుకొస్తున్నాం. విద్యా వ్యవస్థ అంటే అనాలోచిత నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కాదు. గత ప్రభుత్వం రూ.3వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. మేం వచ్చాక రూ.800 కోట్లు చెల్లించాం. జగన్ పెట్టిన ఫీజు బకాయిలపై వైకాపా ఆందోళన చేయడం విడ్డూరంగా ఉంది.

జగన్ పెట్టిన ధాన్యం పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిలు తీరుస్తున్నాం. విద్యార్థులు, టీచర్ల వివరాలను వైకాపా ప్రభుత్వం గందరగోళం చేసింది. విద్యార్థుల సంఖ్య కచ్చితంగా తెలుసుకునేందుకు అపార్ కార్డ్ విధానం, ప్రభుత్వ బడుల్లో డ్రాపవుట్స్ తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ తెస్తున్నాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.




హైదరాబాద్: సినీ రంగానికి చేసిన సేవలకు గానూ నటుడు బాలకృష్ణకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా శుక్రవారం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో బాలకృష్ణకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ అవార్డు తనకు ఎప్పుడో వచ్చి ఉండాల్సిందని పలువురు అంటున్నారని తెలిపారు. సినీ పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకొని.. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఈ సమయంలో ఇలాంటి పురస్కారానికి ఎంపిక కావడం తనకెంతో ప్రత్యేకంగా ఉందని చెప్పారు.

"నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో మన బాధ్యత మనం నిర్వర్తించాలి. బిరుదుల కోసం కాదు. మనకెంతో ఇచ్చిన సమాజానికి మనం ఏదైనా తిరిగి ఇవ్వాలి. సమాజానికి ఉపయోగపడితే మనం ఏదైనా సాధించవచ్చు. పద్మభూషణ్ ఎప్పుడో రావాల్సిందని ఎంతోమంది అంటున్నారు. నేను ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతనలో ఉంటా. పూజలు ఎక్కువగా చేస్తుంటా. పనే నాకు దైవం. నాన్నగారి వందో జయంతి ఇటీవలే పూర్తైంది. ఆయన నటించిన 'మనదేశం' విడుదలై 75వ సంవత్సరాలు కావడం.. ఇండస్ట్రీలో నేను 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం.. మూడోసారి ఎమ్మెల్యేగా గెలవడం.. విడుదలైన నాలుగు చిత్రాలు హిట్స్ అందుకోవడం.. ఇవన్నీ వచ్చిన సందర్భంగా ఈ పురస్కారం కూడా రావడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. కాబట్టి, ఆలస్యం ఏమీ కాలేదు. ఎంతోమంది నటీనటులు కొన్నేళ్లపాటు లైమ్‌లైట్‌లో ఉండి.. ఫేమ్ తగ్గగానే ట్రాక్ మారుస్తారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ లేదా వేరే పాత్రలు పోషిస్తుంటారు. కానీ, ఆ కళామతల్లి ఆశీస్సులు, తల్లిదండ్రుల దీవెనలతో నేను ఇన్ని ట్రాక్ రికార్డులతో మళ్లీ నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టా. ఈ పురస్కారం నన్ను వరించడంపై అభిమానులు, తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇది తమకే వచ్చిందని భావిస్తున్నారు. ప్రేక్షకుల నుంచి అంతటి ప్రేమాభిమానాలను పొందడం నిజంగానే నా పూర్వజన్మ సుకృతం. జీవితంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎవరు ఎన్ని అనుకున్నా మనకు నచ్చినవిధంగా ముందుకు సాగిపోవాలి. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి త్వరలోనే 15 ఏళ్లు అవుతోంది. అందుకు సంతోషంగా ఉంది. ఈ ఆస్పత్రి ఇంతటి పేరు ప్రఖ్యాతులు అందుకుందంటే అది అందరి సమష్టి కృషి" అని బాలకృష్ణ చెప్పారు.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు



అమరావతి: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌ను మే 31 వరకు పొడిగించింది. సంజయ్‌పై వచ్చిన అభియోగాల విచారణపై ఏర్పాటైన కమిటీ సిఫార్సులతో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాల మేరకు 2024 డిసెంబరు 3న సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువరించింది. ప్రస్తుతం ఆ సస్పెన్షన్‌ను మే 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## జయలలిత ఆస్తులు తమిళనాడుకే.. మొత్తం విలువ ఎంతంటే!

బెంగళూరు : దివంగత ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన 1,562 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది.

ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. సుమారు దశాబ్దం క్రితం తమిళనాడు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సమయంలో ఈ ఆస్తుల విలువ రూ. 913 కోట్లు అని పేర్కొంది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. 4,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా.

## తణుకులో తుపాకీతో కాల్చుకుని ఎస్సై ఆత్మహత్య

తణుకు గ్రామీణం: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఎస్సై ఎ.జి.ఎస్.మూర్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తణుకు రూరల్ పీఎస్‌లో విధులు నిర్వహించిన ఎస్సై.. ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. గేదెల అపహరణ కేసులో మూర్తిపై పలు ఆరోపణలు రావడంతో ఆయన్ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం వీఆర్‌లో ఉన్న మూర్తి.. శుక్రవారం ఉదయం పెనుగొండలో సీఎం పర్యటన బందోబస్తుకు వెళ్లే క్రమంలో పీఎస్‌కు వచ్చారు. కొంతసేపు అక్కడే కూర్చొని.. ఆ తర్వాత బాత్‌రూమ్‌లోకి వెళ్లి తుపాకీతో కాల్చుకుని చనిపోయారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది.



## నాలుగుతో పూజాకి పూర్వ వైభవం దక్కేనా?

సినిమా ఇండస్ట్రీలో ఒక్కో హీరోయిన్ రెండు దశాబ్దాలు అవుతున్నా వరుసగా సినిమాలు చేస్తున్న దాఖలాలు చాలానే ఉన్నాయి. ఒక్కసారి స్టార్‌డం దక్కించుకున్న హీరోయిన్స్ ఏళ్లకు ఏళ్లు సినిమాల్లో కొనసాగుతూ వెళ్తున్నారు. మధ్యలో కొన్ని ఫ్లాప్స్ పడ్డా, ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఇండస్ట్రీలో స్టార్‌డంతో కొనసాగుతున్నారు. కానీ పూజా హెగ్డే మాత్రం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కొంత కాలంకే దాదాపు కనిపించకుండా పోయింది. అనూహ్యంగా మరోసారి ఈ అమ్మడు తన అదృష్టం పరీక్షించుకునేందుకు ఏకంగా నాలుగు సినిమాలతో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యింది. గత ఏడాది ఒక్క సినిమాతోనూ పూజా హెగ్డే ప్రేక్షకుల ముందుకు రాలేదు. 2023లో కేవలం ఒకే ఒక్క హిందీ సినిమాతో వచ్చింది. ఆ సినిమా కూడా పెద్ద విజయాన్ని సొంతం చేసుకోలేదు. మొత్తానికి ఈమెకు గత రెండు మూడు సంవత్సరాలుగా బ్యాడ్ టైం నడుస్తోంది. పూజా హెగ్డే కెరీర్ ఖతం అయ్యిందని భావిస్తున్న సమయంలో చాపకింద నీరులా మెల్లగా మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. అందులో మొదటగా 'దేవా' సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ బాలీవుడ్ సినిమాపై పూజా



హెగ్డే చాలా ఆశలు పెట్టుకుని ప్రమోషన్స్‌లో పాల్గొన్న విషయం తెల్సిందే. షాహిద్ కపూర్ హీరోగా నటించిన ఈ హిందీ సినిమాతో బాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇచ్చిన పూజా హెగ్డే ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దేవా సినిమా ఫలితంపై ఈమె బాలీవుడ్ కెరీర్ ఆధారపడి ఉంటుంది. ఇటీవలే ఈ అమ్మడు తమిళ్ స్టార్ హీరో సూర్యతో కలిసి 'రెట్రో' సినిమాలో నటించేందుకు కమిట్ అయ్యింది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ్‌లో రూపొంది పాన్ ఇండియా రేంజ్‌లో రెట్రో సినిమా రిలీజ్ కాబోతున్న విషయం తెల్సిందే. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఈ సినిమా ఉండబోతుంది అనే నమ్మకంను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. తమిళ్ సూపర్ స్టార్ విజయ్‌తో కలిసి ఈమె నటిస్తున్న జన నాయగన్ సినిమా సైతం అంచనాలను భారీగా కలిగి ఉంది. తమిళ్‌లో రెండు సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు హిందీలోనూ రెండు సినిమాలు చేస్తోంది. అందులో దేవా సినిమా నేడు విడుదల కావడంతో ప్రస్తుతం ఈమె చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఈ సినిమాల ఫలితాన్ని బట్టి పూజా హెగ్డేకి పూర్వ వైభవం దక్కుతుందా అనేది తేలిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ నాలుగు సినిమాల్లో కనీసం రెండు మూడు సూపర్ హిట్ అయినా పూజా హెగ్డే మరో నాలుగు ఐదేళ్ల పాటు సినిమా ఇండస్ట్రీలో బిజీగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఒక్క రిలీజ్ కూడా కాలేదు.. చేతిలో మరో మూడు సినిమాలు

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లైలా సినిమాతో ఆకాంక్ష శర్మ అనే కొత్త భామ హీరోయిన్ గా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. మోడలింగ్ తో కెరీర్ ను మొదలుపెట్టిన ఆకాంక్ష తర్వాత మ్యూజిక్ వీడియోల ద్వారా బాగా పాపులరైంది. ఆకాంక్ష హీరోయిన్ గా తెరకెక్కిన లైలా సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఎవరికైనా సరే మొదటి సినిమా రిలీజై, ఆ సినిమా విజయం సాధిస్తే తర్వాత వరుసపెట్టి అవకాశాలొస్తాయి కానీ ఆకాంక్ష శర్మకు మాత్రం మొదటి సినిమా ఇంకా రిలీజ్ కూడా కాకుండానే అవకాశాలు క్యూ కడుతున్నాయి. అమ్మడి చేతిలో ఆల్రెడీ నాలుగు సినిమాలున్నాయి. ఆ నాలుగు సినిమాల్లో మొదట రిలీజయ్యేది విశ్వక్ తో చేసిన లైలానే. లైలా ముందు రిలీజవుతుంది కాబట్టి ఆకాంక్ష డెబ్యూ మూవీ అదే అవుతుంది. లైలా రిలీజయ్యాక ఒక్కోదానికి కాస్త



గ్యాప్ లోనే ఆకాంక్ష నటించిన మరో మూడు సినిమాలు రిలీజ్ కానున్నాయి. వాస్తవానికి అమ్మడు తెలుగు సినిమా ఒప్పుకోకముందో బాలీవుడ్ లో మూడు క్రేజీ ప్రాజెక్టుల్లో అవకాశాలు అందుకుని అవి ఆల్మోస్ట్ పూర్తి చేసింది. అందులో ఓ మూవీ సునీల్ శెట్టి, వివేక్ ఒబెరాయ్ నటిస్తున్న కేసరి వీర్. పీరియాడిక్ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాలో ఆకాంక్షకు కీలక పాత్ర దక్కినట్టు సమాచారం. మరోవైపు మిలప్ జవేరీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తేరా యార్ హూ మై అనే సినిమాలో కూడా ఆకాంక్ష నటిస్తోంది. అమన్ ఇంద్ర కుమార్ హీరోగా నటిస్తున్న ఈ సినిమానే ఆకాంక్ష అన్నింటికంటే ముందుగా సైన్ చేసిన సినిమా. తేరా యార్ హూ మై లో ఆకాంక్ష కు ఇంప్రెస్ అయిన డైరెక్టర్ మిలప్, తన దర్శకత్వంలో రానున్న మరో సినిమాలో కూడా ఆకాంక్షకు అవకాశమిచ్చాడు. ఏదేమైనా నటించిన ఒక్క సినిమా కూడా రిలీజ్ కాకుండానే మూడు సినిమాల్లో ఛాన్సులందుకోవడమంటే అమ్మడి లక్ మామూలుగా లేదు. లైలా రిలీజ్ తర్వాత టాలీవుడ్ నుంచి కూడా మరిన్ని అవకాశాలొచ్చే వీలుంది. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన లైలా సినిమాను షైన్ స్క్రీన్స్ బ్యానర్ లో సాహు గారపాటి నిర్మించాడు. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి రీసెంట్ గా రిలీజైన ఓ సాంగ్ లో ఆకాంక్ష తన శరీర అందాలను ఓ రేంజ్ లో ఆరబోసింది. యాక్షన్ కామెడీగా రూపొందిన ఈ సినిమా ప్రతీ ఒక్కరినీ తప్పకుండా అలరిస్తుందని లైలా చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




# 2025 బోణీ అదిరింది..ఆ రికార్డు సాధ్యమేనా?




కోలీవుడ్ కి ఇంత వరకూ సరైన పాన్ ఇండియా సక్సెస్ ఒక్కటీ లేదు. 1000 కోట్ల క్లబ్ లో చేరిన చిత్రం దరిదాపుల్లో కూడా కనిపించలేదు. గత ఏడాది అయినా అలాంటి సినిమా ఒక్కటైనా పడుతుందని చాలా ఆశలు పెట్టుకున్నారు గానీ పనవ్వలేదు. వెయి కోట్ల సంగతి పక్కనబెడితే గత ఏడాది పరిశ్రమ తీవ్ర నష్టాల్లోనే కనిపిస్తుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. 2024 లో కోలీవుడ్ లో 224 సినిమాలు నిర్మిస్తే వాటిలో కేవలం 20 లోపు సినిమాలు మాత్రమే సక్సెస్ బాట పట్టినట్లు తెలుస్తోంది. అంటే కోలీవుడ్ కి గత ఏడాది నష్టం ఏ స్థాయిలో వచ్చి ఉంటుందో అంచనా వేయొచ్చు. భారీ అంచనాల మధ్య వందల కోట్ల రూపాయలు పెట్టుబడితో నిర్మించిన సినిమాలు 50 కోట్లు కూడా వసూళ్లు తెలేకపోయియి? అంటే పరిస్థితి ఎంత ఆందోళన కరంగా ఉందో అద్దం పడుతుంది. సూర్య నటించిన కంగువపై ఇండస్ట్రీ చాలా అంచనాలు పెట్టుకుంది. హిట్ అయితే 2000 కోట్లు పక్కా అనుకున్నారు. కానీ తొలి షోతోనే కంగువ తేలిపోయింది. 100 కోట్లు రివకరీ చేయడానికి కిందా మీదా పడిందా చిత్రం. ఇండియన్ 2 కూడా భారీ అంచనాల మధ్య విడుదలై డిజాస్టర్ గా మారింది. హిట్ అయితే ఇండియన్ 2 వసూళ్లు గెస్ చేయని విధంగా ఉండేవి. కానీ ప్లాప్ తో బాక్సాఫీస్ వద్ద తేలిపోయింది. రజనీకాంత్ నటించిన వెట్టయాన్, గెస్ట్ రోల్ పోషించిన లాల్ సలామ్ మ్యాజిక్ చేస్తాయనుకుంటే అవి చతికిల పడ్డాయి. తలపతి విజయ్ నటించిన ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ మాత్రం కోలీవుడ్ వరకూ పర్వాలేద నపించినా? ఇతర భాషల్లో డిజాస్టర్ అయింది. ఇలా భారీ బడ్జెట్ సినిమాల ఫలితాలు తారుమారు అవ్వడంతో? కోలీవుడ్ కి గత ఏడాది భారీ నష్టాలు తప్పలేదు. అయితే 2025 లో మాత్రం మెరుగైన ఫలితాలకు అవకాశం కనిపిస్తుంది. ఆరంభం కూడా విశాల్ మదగజరాజాతో అదరగొట్టింది. ఆ సినిమా 60 కోట్ల వసూళ్లను సాధించింది. 12 ఏళ్ల క్రితం నాటి సినిమా ఇది. రిలీజ్ అలస్యమైనా మంచి ఫలితాలతో ఇండస్ట్రీలో జోష్ నిపింది. కూలీ, సర్దార్ -2 సూర్య నటిస్తోన్న44, 45 సినిమాలు, విజయ్ జన నాయగన్, కమల్ హాసన్ థగ్ లైఫ్, ఇండియన్ -3 లాంటి చిత్రాలు భారీ అంచనాలతో రిలీజ్ అవుతున్నాయి.

# బడా ప్రాజెక్టులో ఇద్దరు ఫిక్స్.. అసలు ప్లాన్ ఏంటంటే..



ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఒకప్పుడు విభిన్నమైన కథలు, ట్రెండ్ సెట్టింగ్ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తిరిగి ఫామ్‌లోకి రావడానికి సిద్ధమవుతున్నాడు. గత కొంతకాలంగా ఆయన దర్శకత్వంలో చెప్పుకోదగ్గ హిట్ రాలేదు. 2018లో నాగార్జునతో చేసిన ఆఫీసర్ సినిమా రామ్ గోపాల్ వర్మకి మళ్లీ గుర్తింపు తీసుకువస్తుంది అని అందరూ అనుకున్నా, అది ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

అయితే ఇప్పుడు వర్మ తన మునుపటి ఫామ్‌ను తిరిగి పొందేందుకు పెద్ద స్థాయి పాన్ ఇండియా ప్రాజెక్టును ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుండడం విశేషం. వర్మ తన దృష్టిని ఇప్పుడు పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న కథలపై పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, మలయాళ సూపర్ టాలెంట్ ఫహద్ ఫాజిల్ లాంటి స్టార్ నటీనటులను లైన్‌లో పెట్టాడు. ఇండస్ట్రీలోని టాప్ యాక్టర్స్‌ని ఒకే ప్రాజెక్ట్‌లోకి తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్‌తో వర్మ తన పాత శక్తిని తిరిగి ప్రదర్శించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయి నటీ నటుల వివరాలు వెల్లడి కాలేదు. కానీ వర్మ తనదైన మార్క్ ఉన్న కథను, నటన పరంగా హై రేంజ్ మేకింగ్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాడని తెలుస్తోంది. వర్మ అసలు ప్లాన్ ఏమిటంటే.. ఈ ప్రాజెక్ట్ పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనుండడంతో, ప్రతి పరిశ్రమ నుంచి ఒక స్టార్ యాక్టర్‌ను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్, మాలీవుడ్ నుంచి ప్రముఖ నటీనటులను తీసుకుని సినిమా రేంజ్‌ను మరింత పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వర్మ ఫామ్ లో లేకపోయినా అతని టాలెంట్ ను నమ్మి ఒప్పుకునే స్టార్స్ సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇక వర్మ న్యూ ప్రాజెక్ట్ కథపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే వర్మ గతంలో చేసిన గ్యాంగ్‌స్టర్ డ్రామాల తరహాలో కాకుండా, పూర్తి స్థాయిలో కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నాడని టాక్. ముఖ్యంగా, ఆయన ఈ ప్రాజెక్ట్‌తో తన ఫ్లాప్స్‌ను కవర్ చేసి, మళ్లీ హిట్ డైరెక్టర్‌గా నిలవాలనే పట్టుదలతో ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. వర్మ గతంలో చేసిన కొన్ని సినిమాలు మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఆ స్థాయిని నిలుపుకోవడంలో విఫలమయ్యాడు. కానీ ఈసారి మైత్రీ మూవీ మేకర్స్ వంటి ప్రముఖ బ్యానర్‌తో కలసి పనిచేస్తుండటంతో, ఈ సినిమాకు అన్ని వర్గాల్లో మంచి ప్రచారం లభించే అవకాశం ఉంది.

## రాధిక జోరు తగ్గిందిగా..?

తెలుగు తెర మీద రాధికగా మెప్పించిన చిన్నది నేహా శెట్టి. అంటే ఒక పాత్ర పేరు చెప్పగానే ఆమెను గుర్తు చేసుకునే రేంజ్ లో అమ్మడు పాపులారిటీ సంపాదించింది. సిద్ధు జొన్నలగడ్డతో నేహా శెట్టి చేసిన డీజే టిల్లు సినిమా సూపర్ హిట్ కాగా ఆ సినిమాలో రాధిక పాత్రతో నేహా శెట్టి అదరగొట్టేసింది. కెరీర్ లో ఎలాంటి ఆఫర్ వచ్చినా వదిలి పెట్టకుండా చేయాలని ఫిక్స్ అయిన నేహా శెట్టి చిన్న చిన్న పాత్రలు చేస్తూ వచ్చింది. ఐతే డీజే టిల్లుతో సూపర్ క్రేజ్ తెచ్చుకోగా ఆ తర్వాత బెదురులంక 2012, రూల్స్ రంజన్ సినిమా చేసింది. బెదురులంక సినిమా హిట్ పడినా రూల్స్ రంజన్ ఫ్లాప్ తో మళ్లీ రిస్క్ లో పడింది. ఇక లాస్ట్ ఇయర్ టిల్లు స్క్వేర్ లో కూడా సర్ ప్రైజ్ ఇచ్చింది నేహా శెట్టి. టిల్లు నిర్మాతలే చేసిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



సినిమా చేసిన ఈ అమ్మడు సినిమాలో తన బెస్ట్ ఇచ్చినా ఎందుకో ఆశించిన రేంజ్ లో రెస్పాన్స్ తెచ్చుకోలేదు. ఆ తర్వాత అమ్మడికి ఒక్క సినిమా కూడా పడలేదు. ప్రస్తుతం నేహా శెట్టి నెక్స్ట్ సినిమా కోసం ఎదురుచూస్తుంది. తనదైన శైలిలో మెప్పిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న నేహా శెట్టి ఎలాంటి పాత్ర చేసినా సరే ఆడియన్స్ ని అలరిస్తూ వచ్చింది. ఇచ్చిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తూ అమ్మడు అదరగొట్టేస్తుంది. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత నేహాకి అవకాశాలు లేక ఫోటో షూట్స్ తో సరిపెట్టుకుంటుంది.

ఎలాంటి రోల్ ఇచ్చినా కాదనకుండా చేస్తున్న నేహా శెట్టికి మళ్లీ లైం లైట్ లోకి వచ్చే పాత్రలు పడాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. మరి అమ్మడు కోరిక సినిమా సక్సెస్ ఫుల్ కెరీర్ వస్తుందా లేదా అన్నది చూడాలి. ఐతే ఈసారి గ్లామర్ పరంగానే కాదు ప్రాధాన్యత ఉన్న పాత్రలు కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది నేహా శెట్టి. ఐతే అందుకు తగినట్టుగా అవకాశాలు వస్తే బెటర్ అని చెప్పొచ్చు. ఈసారి డీజే టిల్లు కాదు అంతకుమించిన హిట్ పడితేనే అమ్మడు మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఎలాగైనా మళ్లీ సినిమాలు చేజిక్కించుకోవాలని ప్లాన్ చేస్తుంది.

## బేబి బంప్ సరే.. స్టార్ డాటర్ ఫ్యాషన్ సెన్స్ ఔరా!

బాలీవుడ్ స్టార్ హీరో సునీల్ శెట్టి కుమార్తె ఆథియా శెట్టి, టీమిండియా క్రికెటర్ కె.ఎల్.రాహుల్ ప్రేమవివాహం గురించి తెలిసిందే. ఈ జంట అన్యోన్యత యువ జంటలకు గొప్ప స్ఫూర్తి. 2024 నవంబర్ లో ఆథియా తన గర్భధారణ గురించి సోషల్ మీడియాల ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఆ తర్వాత వీలున్న ప్రతిసారీ ప్రసూతి ఫ్యాషన్ వైబ్స్ గురించి ఆథియా రివీల్ చేస్తూనే ఉంది. గర్భధారణ సమయంలో సౌకర్యంతో పాటు, హై ఫ్యాషన్ సెన్స్ గురించి ఆథియా డీటెయిలింగ్ ఇచ్చింది. తద్వారా తనలోని ఫ్యాషనిస్టా కనుమరుగవ్వలేదని నిరూపించింది ఈ భామ. ఇప్పుడు తల్లి కాబోయే ముందు కడుపులో పెరుగుతున్న బేబీ దృశ్యాన్ని చూపించే అరుదైన అందమైన ఫోటోలను ఆథియా షేర్ చేసింది. ఒక సౌకర్యవంతమైన



డిజైనర్ డ్రెస్‌లో అథియా క్లాసీగా కనిపిస్తోంది. పొడవాటి స్లీవ్స్ .. నల్లని నిట్ టాప్ -సెమీ-షీర్ వైట్ స్కర్ట్ లో బేబి బంప్ ని ఈ అందాల నటి మరింత బ్యూటిఫుల్ గా ఆవిష్కరించింది. ఆథియా త్వరలోనే తల్లి కాబోతోంది. కాబోయే తల్లి ఎంతో గొప్ప అనుభూతులను తన సొంతం చేసుకుంటోంది. మునుపెన్నడూ లేనంత ఆనందం, వైబ్స్ ఆ ముఖంలో మరింత గ్లోని పెంచాయని చెప్పాలి. ముఖ్యంగా ఆథియా గర్భధారణ ఫ్యాషన్ సెన్స్ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఎంపిక చేసుకున్న డ్రెస్ కి తగ్గట్టే, చెవికి ధరించిన స్పెషల్ బ్లింగ్ చెవి పోగులు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇవి మేఘనా పెబుల్ షోల్డర్ డస్టర్స్ బ్రాండ్ నుంచి రూ.10,000 రేంజులో లభిస్తాయి. ఈ బంగారు రంగు చెవిపోగులు ఫ్రేమ్‌ను మరింత డిజైనర్ లుక్ లోకి మార్చాయని చెప్పాలి. ఇతర బరువైన ఆభరణాలేవీ ధరించకుండా సింపుల్ గా స్టైలిష్ గా కనిపించింది ఆథియా. పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైన ఆతియా వీలున్న ప్రతిసారీ కె.ఎల్.రాహుల్ ప్రదర్శనను వీక్షించేందుకు క్రికెట్ స్టేడియంలకు విచ్చేసి అక్కడే ఎక్కువ సమయం గడిపింది.

